తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 103 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శనివారం 14 - 11 - 2026 వెల రూ. 2 రూ/

భారత్ సమిట్ లక్ష్యం తెలంగాణకు

పెట్టుబడులు ఆహ్వానించడమే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించడమే భారత్ సమిట్ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు
- భారత్ సమిట్‌ను విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు
- భారత్ సమిట్‌పై మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ :

తెలంగాణ ప్రత్యేకతలు, అనుకూలతలను ప్రపంచానికి చాటేందుకు భారత్ సమిట్ నిర్వహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. గ్లోబల్ సమిట్ కంటే ముందు భారత్ సమిట్ నిర్వహించినట్లు తెలిపారు. బెంగళూరు, చెన్నై, దిల్లీలో సన్నాహక కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేశారు. త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ సన్నాహక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమిట్‌కు దాదాపు 70 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు వచ్చారని ముఖ్యమంత్రి వెల్లడించారు. కొంతమంది ప్రతినిధులను చివరి నిమిషంలో బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొందరు ఎయిర్‌పోర్టుకు వచ్చాక కూడా వెనక్కి వెళ్లాల్సి వచ్చిందన్నారు.తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించడమే భారత్ సమిట్ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులపై సమిట్‌లో చర్చిస్తున్నామని వివరించారు. తెలంగాణ, హైదరాబాద్‌ను చూపించడం ద్వారా నమ్మకం కలిగించాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ సమిట్‌పై కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, కేసీఆర్‌కు ఎందుకు కోపమో అర్థం కావట్లేదని సీఎం అన్నారు. భారత్ సమిట్‌ను విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు.“ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టినా వ్యతిరేకిస్తున్నారు. మోదీ ఏది చేసినా కరెక్టే, రాహుల్‌గాంధీ ఏది చేసినా తప్పు అనేలా వ్యవహరిస్తున్నారు. - మిగతా 2 లో

రాష్ట్ర ఆదాయం

హైదరాబాద్ నుంచే 40 శాతం



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2026
- అభివృద్ధి కేంద్రీకృతం కావడం తీవ్ర అసమతుల్యతకు నిదర్శనమన్న మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే సమాన అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసమని, కానీ ప్రస్తుతం రాష్ట్ర ఆదాయంలో సుమారు 40 శాతం కేవలం హైదరాబాద్ నగరం నుంచే వస్తుండటం తీవ్రమైన అసమతుల్యతకు నిదర్శనమని టీపీసీసీ - మిగతా 2 లో



నీటి మళ్లింపుపై

విచారణ జరపాలి

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్
- ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? లేదా? అనే అంశంపై బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలన్న కవిత
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్య
- సిద్ధిపేటలో టీఆర్ఎస్ కార్యాలయానికి భూమిపూజ చేసిన కవిత దంపతులు

హైదరాబాద్ :

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈరోజు సిద్ధిపేట - మిగతా 2 లో



ఎల్‌నినోతో హెల్త్ ఎమర్జెన్సీ

భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

- ఎల్‌నినో ప్రభావంతో ఆరోగ్య ముప్పులు పెరిగే అవకాశముందన్న డబ్ల్యూహెచ్ఓ
- అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్‌ను హైరిస్క్ దేశంగా గుర్తించి అప్రమత్తం చేసిన వైనం
- వడగాలులు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, పోషకాహార లోపం ప్రధాన ప్రమాదాలు
- ముందస్తు హెచ్చరికలు, వైద్య సన్నద్ధత, తాగునీటి భద్రతను బలోపేతం చేయాలని సూచన

భారత్‌లో సైన్స్, ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి



- ప్రధాని నరేంద్ర మోదీ
- కర్ణాటక మైసూర్ యూనివర్సిటీ ప్రాంగణంలో దేశంలోనే తొలి డోమ్ ప్లానిటోరియాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు
- 100 కిలోమీటర్ల క్లబ్‌లో చేరిన బెంగళూరు మెట్రో

ఢిల్లీ :

భారతదేశంలో సైన్స్ (విజ్ఞానం), ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి కలిసికట్టుగా ముందుకు సాగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నేటి భారతీయ యువత ఖగోళ శాస్త్రం (ఆస్ట్రోఫిజిక్స్), సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని కొనియాడారు. చాముండి కొండల దిగువన ఉన్న మైసూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో భారతదేశంలోనే మొట్టమొదటి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం కాస్మోస్- మైసూరును ప్రారంభించిన మోదీ అనంతరం ప్రసంగించారు. ఈ క్రమంలోనే దేశంలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించడానికి మైసూరు రాజకుటుంబం - మిగతా 2 లో

సీఎం చంద్రబాబుపై

మండిపడ్డ వైఎస్ షర్మిల



- రాష్ట్రంలో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయన్న షర్మిల
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్లియర్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్న
- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. - మిగతా 2 లో



కొండెక్కిన కోడిగుడ్డు ధర

- గత మూడు నెలలుగా స్థిరంగా ఉండి మళ్లీ పెరిగిన గుడ్డు ధర
- హోల్‌సేల్ మార్కెట్లో డజన్ గుడ్ల ధర రూ.80 నుంచిరూ.96కు చేరిక
- స్వల్ప వ్యవధిలోనే డజన్‌పై ఏకంగా రూ.16 పెరిగిన వైనం

హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో సామాన్యుడికి కోడిగుడ్డు ధర షాక్ ఇస్తోంది. దాదాపు మూడు నెలల పాటు నిలకడగా ఉన్న గుడ్ల ధరలు - మిగతా 2 లో

అసోం రోడ్డు ప్రమాదంలో

23 మంది దుర్మరణం

- అసోంలోని కజిరంగా సమీపంలో రోడ్డు ప్రమాదం
- మినీ బస్సును ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టిన కంటైనర్ లారీ
- ఘటనలో 23 మంది దుర్మరణం పలువురికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఎక్కువ మంది పాఠశాల కాలేజీ విద్యార్థులు
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అసోం సీఎం ఆదేశం

2 లో..

పెట్టుబడులే కాదు ప్రాజెక్టులు వేగంగా పట్టాలెక్కుతున్నాయి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- అవసరమైన సహకారం అందిస్తామని పారిశ్రామికవేత్తలకు సీఎం భరోసానిచ్చారు
- విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా కీలక సమావేశాలు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి :

“పారిశ్రామికవేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటాం, పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులిస్తాం. అవసరమైన సహకారం అందిస్తాం”. ఇదీ పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన భరోసా. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ముందుకు సాగుతోందని సీఎం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రకటనలే కాదు. ప్రాజెక్టులు కూడా వేగంగా పట్టాలెక్కుతున్నాయని స్పష్టం చేశారు.రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా సీఎం చంద్రబాబు పలు కీలక సమావేశాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,750 కోట్లతో ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సెయింట్ గోబెన్ ముందుకొచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా 400 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. సంస్థ సీఈవో శ్రీధర్ ముఖ్యమంత్రితో సమావేశమై ఈ వివరాలు వెల్లడించారు.ఇప్పటికే తడ, విశాఖ, కావలిలో తయారీ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. ప్లాస్టర్ బోర్డ్, జిప్సమ్ సిస్టమ్స్, ఇన్సులేషన్ రంగాల్లోనూ పెట్టుబడులకు ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఐఐటీ తిరుపతితో కలిసి నిర్మాణ రంగ ఉత్పత్తుల పరిశోధనలకు ఏపీని కేంద్రంగా ఎంచుకోవాలని చంద్రబాబు సూచించారు. అమరావతి నిర్మాణంలోనూ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. తెనాలిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు శ్రీధర్ - మిగతా 2 లో

ఏకగ్రీవ పంచాయతీలకు

కాసుల వర్షం

- కనిష్ఠంగా రూ.15 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షలు
- రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- జనాభా ప్రాతిపదికన మూడు కేటగిరీలుగా నగదు బహుమతులు
- 5 వేలలోపు జనాభా ఉంటే రూ.15 లక్షలు
- 5,001 నుంచి 10 వేల జనాభా ఉంటే రూ.25 లక్షలు
- 10 వేలకు పైగా జనాభా ఉంటే రూ.50 లక్షలు
- పంచాయతీ ఎన్నికల వేళ శాంతిభద్రతల సమస్యల నివారణే లక్ష్యం



అమరావతి :

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల జోరు కొనసాగుతుంది. ఏకగ్రీవాల కోసం అధికారులు వేచిచూస్తున్నారు. పంచాయతీల్లో ఏకగ్రీవాలు జరిగేలా భారీ ప్రయత్నాలే జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రోత్సాహకాలు పెంచడం ద్వారా ఆకట్టుకుంది. రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ ఎన్నికలకు నేడు (శుక్రవారం) నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలకు అందించే ప్రోత్సాహకాలను ప్రభుత్వం భారీగా పెంచింది. కనిష్ఠంగా రూ.15 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షలు అందించనున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకూ ఉన్న నాలుగు కేటగిరీలను 3కు కుదించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 11 - 2026

సంపాదకీయం

సాధ్యమేనా..?

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా స్వదేశంలో కాలుమోపే సాహసోపేతమైన నిర్ణయం ఇప్పుడు ఉభయదేశాల మధ్యా మళ్ళీ అగ్గిరాజేసింది. నేను వస్తున్నాను, వెంటనే పాస్‌పోర్టు, గుర్తింపుకార్డు ఇవ్వండి అంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వానికి ఆమె పెట్టుకున్న దరఖాస్తును, టెర్రరిస్టులకు, నేరస్తులకు అటువంటివి ఇవ్వరు అంటూ అక్కడి ప్రభుత్వం తిరస్కరించింది. విదేశాంగమంత్రి హుమాయూన్ కబీర్ దీనిని డ్రామా అంటూ తీసిపారేశారు. ఆమె నిజంగా బంగ్లాదేశ్ రావాలనుకుంటే ఒకే దారి ఉన్నదంటూ, భారత్--బంగ్లాదేశ్ మధ్య ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని గుర్తుచేశారు. తనను అప్పగించవలసిందిగా భారత్‌ను కోరి, ఆ మార్గంలో బంగ్లాదేశ్ వచ్చి, కోర్టుకు లొంగిపోయి శిక్ష అనుభవించాలన్నారు ఆయన. రెండేళ్ళక్రితం విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేసి, అనేకమంది ప్రాణాలు కోల్పోవడానికి కారకురాలంటూ అక్కడి కోర్టు ఆమెకు ఉరిశిక్ష విధించింది కనుక, వస్తే ఉరితప్పదని అక్కడి చీఫ్ ప్రాసిక్యూటర్ కూడా మరోమారు గుర్తుచేశారు. తనను అరెస్టు చేస్తారని, ఉరితీస్తారని తెలిసికూడా డిసెంబరులో తాను బంగ్లాలో కాలూనడం ఖాయమని, ప్రజలకోసం తాను ప్రాణత్యాగానికి కూడా వెరవనని హసీనా చాలాసార్లు ప్రకటించారు. ఇప్పుడు మళ్ళీ ఆమె రాకతో ముడిపడి అక్కడ హింస రేగింది, ఆమె పార్టీ దాడులకు తెగబడుతూ తమను భయపెట్టేందుకు ప్రయత్నిస్తోందని అక్కడి ప్రభుత్వం ఆరోపణలు చేస్తోంది.ఇలాంటి ప్రయాణాలకు ట్రావెల్ డాక్యుమెంట్ తప్పనిసరి కదా అన్నది భారత్ స్పందన. స్వదేశానికి తిరిగివచ్చే ఆమె హక్కును బంగ్లాదేశ్ ఎలా కాదంటుంది? అన్న ప్రశ్నకు బంగ్లాదేశ్ హైకమిషన్ మరింత చక్కగా సమాధానం చెబుతుందని, అప్పగింత గురించి తాము కొత్తగా మాట్లాడేదేమీ ఉండబోదని భారత విదేశాంగశాఖ ప్రతినిధి వ్యాఖ్యల సారాంశం. భారత్ అప్పగించదు, బంగ్లాదేశ్ ఆహ్వానించదు కనుక ఈ సంక్లిష్ట పరిణామాల నేపథ్యంలో ఆమె డిసెంబరులో బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టడం జరిగేపని కాదని కొందరి నమ్మకం. అయితే, హసీనా అదేపనిగా వచ్చేనెల వెళ్ళడం ఖాయమని అంటున్నారు కనుక, అనధికారికంగా సరిహద్దులు దాటిపోవడానికి సైతం సిద్ధపడతారా? అని కొందరి అనుమానం. బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ కూడా ఆరునూరైనా డిసెంబరులో ఆమె రాక ఖాయమని ఉద్ఘాటంగా ప్రచారం చేసుకుంటోంది.లండన్‌లోని మాట్రిక్స్ చాంబర్స్ ద్వారా భారత్‌లోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు పాస్‌పోర్టుకోసం అభ్యర్థించడంతో 26 నెలల తరువాత హసీనా అధికారికంగా తన ప్రభుత్వంతో సంప్రదింపులు ఆరంభించినట్టయింది. భారత్ చేరిన ఏడాదిపాటు ఆమె దాదాపు నిశ్శబ్దంగానే ఉన్నారు. క్రమంగా సామాజిక మాధ్యమాల ద్వారా తన ఉనికిని చాటుకుంటూ, మరుసటి ఏడాది విలేకరుల సమావేశాలను ఏర్పాటుచేయడం వరకూ వచ్చి బంగ్లాదేశ్ మీద ఒత్తిడి పెంచారు. తన గత హోదాలతో సంబంధం లేకుండా కేవలం పాస్‌పోర్టు, పౌరసత్వ గుర్తింపుకార్డు అడిగితే కూడా బంగ్లాదేశ్ తిరస్కరించడం, తన పార్టీని పునరుద్ధరించుకొనే హక్కును ఆమెకు దక్కనివ్వకపోవడం ప్రపంచం గుర్తించింది. ఆరుగురు బ్రిటిష్ ఎంపీలు ఆమె పక్షాన ముందుకు రావడం బంగ్లా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే పరిణామం. రెండేళ్ళక్రితం బంగ్లాలో రాజకీయ సంక్షోభం, ఆగస్టులో హసీనా భారత్ రాక ఉభయదేశాల సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆమె ప్రబలశత్రువు, బంగ్లా ప్రధాని తారీఖ్ రహ్మాన్ దేశాలన్నీ తిరుగుతున్నారు కానీ, ఢిల్లీలో మాత్రం కాలూనడంలేదు. రహ్మాన్ పర్యటనను హసీనా అప్పగింతతో ముడిపెట్టి, అది జరిగిన తరవాతే పర్యటన ఉంటుందని బంగ్లాదేశ్ ఒత్తిడి తెస్తున్నట్టు వార్తలు వింటున్నాం. రహ్మాన్ వచ్చి, భారత ప్రధానితో ఈ విషయంపై చర్చించివుంటే, ఈ అంశం ఇంత సంక్లిష్టంగా మారేదికాదేమో. ఉభయ దేశాలు ఈపాటికే ఏదో ఒక మార్గాన్ని కనిపెట్టగలిగేవి. రహ్మాన్‌తో సయోధ్యకు భారత్ తనవంతుగా చేసిన ప్రయత్నాలు కూడా తక్కువేమీ కాదు. అయినప్పటికీ, పలు కారణాలరీత్యా హసీనా పేరిట భారత్‌తో ఏ మాత్రం సానుకూలంగా వ్యవహరించకూడదని అక్కడి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టుంది. కనీసంగా ఉండాల్సిన సుహృద్భావం కూడా లోపించిన కారణంగా అన్ని రంగాలపైనా దాని దుష్ప్రభావం పడింది. ద్వైపాక్షిక వాణిజ్యం పెద్దగా తగ్గకపోయినా, పరస్పరం విధించుకున్న వాణిజ్య ఆంక్షలతో దూరం పెరిగింది. గంగానదీ జలాల ఒప్పందాన్ని సైతం ఈ విభేదాలు ప్రభావితం చేస్తున్నాయి. దేశాన్ని వీడి రెండేళ్ళయిన సందర్భంలో ఆగస్టు 5న ఆమె చేసిన ప్రసంగం బంగ్లా పాలకులతో సంబంధాలను సంక్లిష్టం చేసింది. డిసెంబరులో ఆమె భారత్‌ను వీడుతారా, అది ఎలా జరుగుతుందన్నది అటుంచితే, రాబోయే రెండునెలల కాలం ఉభయ దేశాలకు విషమ పరీక్షే.



పెట్టుబడులే కాదు ప్రాజెక్టులు వేగంగా పట్టాలెక్కుతున్నాయి

వెల్లడించారు. పెట్టుబడుల రక్షణ చట్టం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెంచిందని ప్రశంసించారు.దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ సీఎంతో భేటీ అయ్యారు. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఆయన భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న ముక్కం కోస్టల్ వెల్‌నెస్, సర్ఫ్ క్లబ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. రూ.55 కోట్ల పెట్టుబడితో ముక్కం బీచ్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబుతో గ్రూప్ ఎండీ శాశ్వత్ గొయెంకా భేటీ అయ్యారు. పుర్వా గ్రీన్ పవర్ ద్వారా రూ.3,286 కోట్ల పెట్టుబడితో 349 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఈ సంస్థ ఏర్పాటు చేస్తోంది. సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లోనూ పెట్టుబడులను పరిశీలించాలని గొయెంకాను సీఎం కోరారు. విజయవాడలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫస్ట్‌సోర్స్‌ను విశాఖపట్నం, తిరుపతికి విస్తరించాలని పీ4 కార్యక్రమంలో భాగస్వాములు సూచించారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయం: భారత్‌లో ఖతార్



రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్ సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు సహకరించాలని ఖతార్ రాయబారిని చంద్రబాబు కోరారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. త్వరలోనే ఖతార్ అధికారిక బృందం ఏపీలో పర్యటిస్తుందని రాయబారి తెలిపారు.ఏపీ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పేలా విశాఖలో 'టైమ్ ఇంపాక్ట్ డిన్నర్' నిర్వహించారు. 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ దగ్లస్‌తో ముఖాముఖిలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల పురోగతిని ప్రపంచానికి పరిచయం చేయాలని చంద్రబాబు కోరారు. చంద్రబాబు నాయకత్వం, రాష్ట్ర అభివృద్ధిని దగ్లస్ ప్రశంసించారు. ఏపీ విజయగాథను, అభివృద్ధి నమూనాను ప్రపంచానికి పరిచయం చేస్తామని తెలిపారు.'బిల్డ్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్' అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో వరాహ క్వెమేట్‌ఏజీకి చెందిన మధుర్ జైన్, పబ్లిసిస్ గ్రూప్ సీఈవో అనుప్రియ ఆచార్య, ఇసుజు మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ మియో ఓకా పాల్గొన్నారు. ప్రపంచ వృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలు, భవిష్యత్ పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధి అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎల్‌నినోతో హెల్త్ ఎమర్జెన్సీ.. భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి - ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వడగాలులు, కరవు, అంటువ్యాధులు, ఆహార కొరత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరించింది. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించింది. భారత్‌ను అధిక లేదా అత్యధిక ఆరోగ్య ముప్పు ఎదుర్కొనే దేశాల జాబితాలో చేర్చింది. దక్షిణాసియాలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరమని స్పష్టం చేసింది.నవంబర్ 2న విడుదల చేసిన వ్యూహాత్మక సన్నద్ధత, స్పందన ప్రణాళికలో డబ్ల్యూహెచ్ఓ ఈ విషయాలను వెల్లడించింది. 2026 అక్టోబర్ నుంచి 2027 సెప్టెంబర్ వరకు గ్రేడ్-3 స్థాయి అత్యవసర స్పందన కొనసాగనుంది. ఇది సంస్థలో అత్యున్నత స్థాయి స్పందన. వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణ, నివారణ, వైద్య సేవలు, సమన్వయంపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. తొలి 6 నెలల కార్యకలాపాల కోసం సుమారు 3.5 కోట్ల డాలర్ల నిధులు అవసరమని అంచనా వేసింది. ఎల్‌నినో నేరుగా వ్యాధులకు కారణం కాదని, వాతావరణ పరిస్థితులను మార్చి ఆరోగ్య సమస్యలు పెరిగేలా చేసే ప్రమాద కారకమని డబ్ల్యూహెచ్ఓ వివరించింది.సెప్టెంబర్ 5న విడుదలైన ప్రపంచ ఆరోగ్య పరిస్థితుల అంచనాలో భారత్‌ను అధిక లేదా అత్యధిక ముప్పు ఉన్న దేశంగా గుర్తించింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులకూ ఇదే తరహా ప్రమాదాలున్నాయని పేర్కొంది.

తీవ్ర ఉష్ణోగ్రతలు: వడగాలుల వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె, శ్వాసకోశ, మూత్రపిండాల సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారికి ముప్పు ఎక్కువ.

డెంగీ, మలేరియా: ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు దోమల వ్యాప్తిపై ప్రభావం చూపుతాయి. నీటి కొరతతో ఇళ్లలో నిల్వ చేసే నీటి పాత్రలు దోమల పెరుగుదలకు కారణం కావచ్చు. ఈశాన్య భారతంలో మలేరియా ముప్పునూ నివేదిక ప్రస్తావించింది.

నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు: వరదలు, పారిశుద్ధ్య సమస్యల వల్ల తాగునీరు కలుషితమై లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.

ఆహార కొరత, పోషకాహార లోపం: వర్షాలు తగ్గితే పంటల దిగుబడి, వ్యవసాయ ఆధారిత ఉపాధి దెబ్బతింటాయి. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార సమస్యలు పెరిగే అవకాశం ఉంది. వైద్య సేవలకు అంతరాయం: తీవ్ర వాతావరణ పరిస్థితులు ఆసుపత్రులు, ఔషధ సరఫరా వ్యవస్థలను ప్రభావితం చేయవచ్చు. మధుమేహం, గుండె, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారికి చికిత్స అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.

భారత వ్యవసాయం, తాగునీటి అవసరాలు రుతుపవనాలపై ఆధారపడి ఉండటంతో వర్షపాతంలో మార్పులు కీలకంగా మారనున్నాయి. 2026 ఆగస్టులో పార్లమెంటుకు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సీజన్ మొత్తంలో దీర్ఘకాలిక సగటులో 90 శాతం వర్షాలు కురిసే అవకాశముందని, అంచనాలో 4 శాతం వరకు తేడా ఉండవచ్చని పేర్కొంది.అయితే ఎల్‌నినో ఏర్పడితే రుతుపవనాలు పూర్తిగా విఫలమవుతాయని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రత, ఏర్పడే సమయం వంటి ఇతర వాతావరణ పరిస్థితుల ప్రభావంపైనా వర్షపాతం ఆధారపడి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చు.పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, వైకల్యాలున్నవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముంది. పట్టణ మురికివాడలు, మారుమూల ప్రాంతాల్లో నివసించేవారికి సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, చల్లదనం కల్పించే సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం మరో సమస్య. వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, వీధి వ్యాపారుల వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు వడగాలుల బారిన పడే ప్రమాదం ఉంది. ఉపాధి కోల్పోవడం, ఆహార కొరత, వలసల వంటి పరిణామాలు మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపవచ్చని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.వాతావరణ మార్పులు అత్యవసర పరిస్థితులుగా మారకముందే స్పందించాలన్నది డబ్ల్యూహెచ్ఓ ప్రణాళికలోని ప్రధాన ఉద్దేశం. వ్యాధుల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించింది. అవసరమైన మందుల నిల్వలు, ఆసుపత్రుల్లో అత్యవసర సేవల కొనసాగింపు, వాతావరణ శాఖలు, ఆరోగ్య విభాగాలు, విపత్తు నిర్వహణ సంస్థల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొంది.భారత్‌లో డెంగీ, మలేరియా నివారణ చర్యలు, సురక్షిత తాగునీటి సరఫరా, వడగాలులను ఎదుర్కొనే వైద్య సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినోతో దేశంలోని ప్రతి ప్రాంతంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందని ఈ హెచ్చరిక అర్థం కాదని, స్థానిక వాతావరణ పరిస్థితులు, ముందస్తు సన్నద్ధతను బట్టి ప్రభావం మారుతుందని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది.

భారత్‌లో సైన్స్, ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి -

చేసిన కృషిని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. మైసూర్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమే కాకుండా, బెంగళూరులోని అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఏర్పాటు కోసం భూమిని దానం చేయడం ద్వారా దేశంలో శాస్త్రీయ అభివృద్ధికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాల్ని కూడా మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. చంద్రయాన్- 3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. గతేడాది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన విషయాన్ని కూడా గుర్తుచేశారు."భారతదేశంలో ఆధ్యాత్మికత, సైన్స్ ఎప్పుడూ కలిసే నడుస్తాయి. ఆధునిక పరికరాలు ఏవీ అందుబాటులో లేని కాలంలోనే మన పూర్వీకులు విశ్వాన్ని, గ్రహాల కదలికలను ఎంతో నిశితంగా అధ్యయనం చేశారు. విశ్వంలో ఎన్నో రహస్యాలను ఛేదించడానికి మన ఖగోళ శాస్త్రవేత్తలు ఎంతో సంక్లిష్టమైన గణిత లెక్కలను ఎంతో సులభంగా పూర్తి చేశారు.కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు పెద్దపీట వేస్తూ శుక్రవారం రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ నిర్మించిన ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియంను ప్రారంభించారు. దీనిని ఖగోళ విజ్ఞానంపై విద్య, పరిశోధన, శిక్షణకు కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ ప్లానిటోరియం ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచడానికి ఇది ఒక అద్భుతమైన పరిశోధన, శిక్షణా కేంద్రంగా ఉపయోగపడుతుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.సంప్రదాయ ప్లానిటోరియాల మాదిరిగా ఈ మైసూరు కాస్మోస్ ప్లానిటోరియంలో ప్రొజెక్టర్లను ఉపయోగించకుండా వినూత్న సాంకేతికతను వాడారు.15 మీటర్ల వెడల్పు గల వంపు తిరిగిన డోమ్‌పై సుమారు 6150 ప్యానెల్స్‌లో 4.2 కోట్ల వ్యక్తిగత ఎల్ఈడీలను అమర్చారు.వీటిని రియల్ టైమ్‌లో కంట్రోల్ చేయవచ్చు. దీంతో నక్షత్రాలు, గ్రహాలు, విశ్వానికి సంబంధించిన దృశ్యాల్ని మరింత స్పష్టంగా వీక్షించొచ్చు. ఇది సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది.ఇదే పర్యటనలో మోదీ- బెంగళూరు నమ్మ మెట్రో పింక్ లైన్‌ను కూడా ప్రారంభించారు. మెట్రో విస్తరణ కేవలం రవాణా ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలనే దేశ లక్ష్యంలో భాగమని వివరించారు. దిల్లీ, ముంబయి మెట్రోపాలిటన్ ప్రాంతం తర్వాత 100 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ కలిగిన మూడో నగరంగా బెంగళూరు నిలిచిందని ప్రధాని చెప్పారు. కొత్త మెట్రో మార్గం వల్ల బెంగళూరులోని విద్యాసంస్థలు, వ్యాపార, సాంకేతిక, వాణిజ్య కేంద్రాలకు కనెక్టివిటీ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థలో వస్తున్న మార్పుల్ని ప్రస్తావించిన మోదీ- వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ స్టేషన్ల ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకుంటున్నామన్నారు. కర్ణాటకలో చామరాజనగర్, చిక్కమగళూరు వంటి 60కిపైగా స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా మారుస్తున్నట్లు మోదీ వెల్లడించారు.

ఏకగ్రీవ పంచాయతీలకు కాసుల వర్షం

మొదటిపేజీ తరువాయి - నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది.తాజా నిర్ణయం ప్రకారం ఏకగ్రీవమైన వాటిలో 5 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10 వేలలోపు జనాభా గల పంచాయతీలకు రూ.25 లక్షలు, పది వేల కంటే మించిన జనాభా గల పంచాయతీలకు రూ.50 లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పటివరకు 2 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5 వేలలోపు జనాభా గల పంచాయతీలకు రూ.10 లక్షలు, 5,001 నుంచి 10 వేల లోపు జనాభా గల పంచాయతీలకు రూ.15 లక్షలు, 10 వేలపైన జనాభాగల పంచాయతీలకు రూ.20 లక్షలు ఇచ్చేవారు.ఇప్పుడు వీటిని సవరించడం ద్వారా గ్రామాల్లో పంచాయతీలకు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం ద్వారా ఉద్రిక్తతలను నివారించడం ఒక లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. గ్రామాల్లో ఎన్నికలు సందర్భంగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను గణనీయంగా తగ్గించుకునేందుకు పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి సాధ్యమైనంత వరకు తక్కువ చేసేందుకు ఈ ఏకగ్రీవ ఎన్నికలు ఉపకరిస్తాయి. దాదాపు 20 నుంచి 30% గ్రామపంచాయతీలు ఏకగ్రీవాలు అవుతాయని అంచనా వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. 26 జిల్లాల్లో పంచాయతీలకు తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక ఏకగ్రీవాలకు ఈ ప్రోత్సాహకాల ఉత్తర్వులు తెర తీయనున్నాయి.

సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఈ పథకం నిర్వీర్యమైపోయిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని గుర్తుచేశారు. నేడు చంద్రబాబు పాలనలో అదే పథకం వేల కోట్ల బకాయిలతో చదువంటేనే దండుగగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ పథకం బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, అందులో గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆమె తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని షర్మిల దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని బకాయిలు క్లియర్ చేస్తామని, నేరుగా కాలేజీల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ఆమె నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని భారీ ప్రచారాలు చేసుకుంటూ, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెంచుకుంటూ పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

మొదటిపేజీ తరువాయి - కొద్ది రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. హోల్‌సేల్ మార్కెట్లో డజన్ గుడ్ల ధర గతంలో రూ.80 ఉండగా, నాలుగైదు రోజుల క్రితం రూ.90కి చేరింది. ప్రస్తుతం ఆ ధర ఏకంగా రూ.96కు చేరుకుంది. స్వల్ప వ్యవధిలోనే డజన్‌పై రూ.16 మేర ధర పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.హోల్‌సేల్ ధరలకు అనుగుణంగా రిటైల్ మార్కెట్లోనూ ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. గతంలో చిల్లర దుకాణాల్లో రూ.6 నుంచి రూ.7 మధ్య పలికిన ఒక్కో కోడిగుడ్డు ధర, ప్రస్తుతం రూ.7.50 నుంచి రూ.8 వరకు పలుకుతోంది. ఆగస్టు మొదటి వారంలో తగ్గిన గుడ్డు ధర.. డజన్ రూ.80 వద్దే దాదాపు వారం క్రితం వరకు స్థిరంగా కొనసాగింది. అయితే గత కొద్ది రోజులుగా డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడం వంటి మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో ధరలు వేగంగా పెరిగాయి.నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ సూచించిన హోల్‌సేల్ ధరల ప్రకారం.. నవంబర్ 13 నాటికి హైదరాబాద్‌లో 100 గుడ్ల ధర రూ.640గా ఉండగా, విశాఖపట్నంలో రూ.625 వద్ద నమోదైంది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల భారంతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రధాన పోషకాహార వనరుగా ఉండే కోడిగుడ్డు ధరలు కూడా పెరగడం మరింత భారంగా మారుతోంది. మార్కెట్లో ధరలు ఇంకా పెరుగుతాయా? లేక దిగివస్తాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

అసోం రోడ్డు ప్రమాదంలో 23 మంది దుర్మరణం

మొదటిపేజీ తరువాయి - అసోంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కజిరంగా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళుతున్న మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ముఖాముఖి ఢీకొన్న ఘోర ప్రమాదంలో కనీసం 23 మంది దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం అందుతోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొకాఖాట్ నుంచి నాగావ్ వైపు వెళుతున్న మినీ బస్సు (ట్రావెలర్) కజిరంగా కోహోరా పరిధిలోని హథీకూలి టీ ఎస్టేట్ సమీపంలో గల రంగాజన్ వద్ద జాతీయ రహదారి 715పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్కును మినీ బస్సు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయి ప్రయాణికులు లోపలే ఇరుక్కుపోయారు.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక ప్రజలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం నుంచి మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తొలుత ఏడుగురు మరణించినట్లు సమాచారం వచ్చినప్పటికీ, సహాయక చర్యలు ముమ్మరం చేసే కొద్దీ మృతుల సంఖ్య 23కు చేరింది.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 27 నుంచి 35 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థినులతో పాటు కజిరంగా హైస్కూల్ విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన పలువురిని వెంటనే స్థానిక కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న బాధితులను మెరుగైన వైద్యం కోసం జోర్హాట్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.నేషనల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో నిర్దేశించిన వేగ పరిమితి నిబంధనలను ఉల్లంఘించి మినీ బస్సు మితిమీరిన వేగంతో వెళ్లడమే ఈ ఘోర ప్రమాదానికి కార

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 11 - 2026

పీజీ స్పాట్ అడ్మిషన్ల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎస్కేయూ వీసీకి ఏఐఎస్ఎఫ్ వినతి



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరిధిలోని విద్యార్థులు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ (వీసీ) ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ గారికి వినతిపత్రం అందజేశారు. గుంతకల్లు పట్టణంలోని ఎస్.ఎస్.జి.ఎస్ డిగ్రీ కళాశాలకు విచ్చేసిన వీసీని ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి విద్యార్థుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులపై ఉందని అన్నారు. పీజీ స్పాట్ అడ్మిషన్లను రద్దు చేయాలనే నిర్ణయాన్ని యూనివర్సిటీ వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, విద్యార్థుల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వారి ప్రొవిజినల్ సర్టిఫికెట్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అందజేయాలని కోరారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను అధికారులు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని వెంకట్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించి, ఈ సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి యశ్వంత్, నాయకులు సూరి, సాయి కిరణ్, వినోద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ఘనంగా నిమోనియా అవగాహన కార్యక్రమం

శిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి పట్టణం లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎల్లప్ప సూపరిండెంట్ ఆధ్వర్యంలో నిమోనియా దినం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్లప్ప మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల్లో నిమోనియా కారణంగా దాదాపు 7.2 శాతం మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులైన నిమోనియా, వాతావరణ మార్పుల వలన గాలిలో తేమ శాతం ఎక్కువ కావడం, చలి తీవ్రత పెరగడం, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో మంచు కురవడం, చలిగాలిలో తిరగడం వల్ల చిన్న పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. దీనికి తోడు పోషకాహార లోపం, తల్లులు సరిగా పాలు పట్టకపోవడం, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించకపోవడం, తరచూ వచ్చే జలుబు మరియు ఊపిరితిత్తులలో నెమ్ము చేరడం వంటి కారణాల వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. పిల్లల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం, డొక్కలు ఎగరవేయడం, సరిగా పాలు తాగలేకపోవడం, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. శిశువులకు తల్లిపాలు సక్రమంగా పట్టించడం, వ్యాధి నిరోధక టీకాలు వేయించడం మరియు తగిన సమయంలో అనుబంధ ఆహారం అందించడం ద్వారా నిమోనియా బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. సమాజంలో నిమోనియా నివారణపై అవగాహన కల్పించేందుకు రాబోయే రెండు నెలల పాటు "సాన్స్" ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రమ్య తేజ, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ షాషావలి, డిప్యూటీ హెచ్ఈఓ సి. వెంకటేష్, సూపర్వైజర్ రెడ్డమ్మతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేద కుటుంబం వివాహానికి
అండగా నిలిచిన ముంటిమడుగు కేశవరెడ్డి



గార్లదిన్నె (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : నిరుపేద కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి సీ సీ బ్యాంక్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి గారు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గార్లదిన్నె మండలం, పెనకచర్ల గ్రామానికి చెందిన మాల రామాంజనేయులు కుమార్తె స్వాతి వివాహ వేడుకల నిమిత్తం ఆయన రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముంటిమడుగు కేశవరెడ్డి గారు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. నూతన వధూవరుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కేశవరెడ్డి గారి సేవా కార్యక్రమాలను అభినందించారు.

పక్షవాత బాధితురాలికి ఏడీసీసీ బ్యాంక్
చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆర్థిక సహాయం



గార్లదిన్నె (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆపన్నహస్తం అందించారు. శింగనమల నియోజకవర్గం, గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామానికి చెందిన బోయ చిదంబరయ్య భార్య లక్ష్మీదేవి ఇటీవల పక్షవాతం బారిన పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కేశవరెడ్డి వెంటనే స్పందించి, బాధితురాలి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషాన్నిస్తుందని, భవిష్యత్తులోనూ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పేదల పట్ల ఆయన చూపిస్తున్న సేవా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ పంచాయతీలో టీడీపీకి ఝలక్

వైఎస్ఆర్సీపీ కండువా కప్పుకున్న మాజీ వార్డు మెంబర్లు



అనంతపురం రూరల్ (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం రూరల్ పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, మాజీ వార్డు మెంబర్లు టీడీపీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో అనంతపురం రూరల్ పంచాయతీ మాజీ వార్డు మెంబర్లు గంగాధర్, షేక్షావలిలతో పాటు నాయకుడు మంజునాథ్ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వీరికి అనంత వెంకటరామిరెడ్డి సాదరంగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న సర్పంచ్ మరియు వార్డు అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ చేరికల కార్యక్రమంలో నగర మేయర్ రమేష్ గౌడ్, అనంతపురం రూరల్ పంచాయతీ నాయకులు మహేష్, సుధాకర్ రెడ్డి, నగేష్, అశోక్, శీనా తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపాను నష్టం అంచనాకు బాపట్ల జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

బాపట్ల తెలుగుకలం నవంబర్ 13 : ఇటీవల సంభవించిన మురసు తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం శుక్రవారం బాపట్ల జిల్లాకు చేరుకుంది. జిల్లాకు విచ్చేసిన బృందం సభ్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి మొక్కలను అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం స్థానిక కలెక్టరేట్‌లో తుపాను బీభత్సానికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. జిల్లాలో జరిగిన నష్టం వివరాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందానికి వివరిస్తూ, వివిధ శాఖల వారీగా రూపొందించిన సమగ్ర నివేదికను వారికి అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం నాయకులు చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ, తుపాను కారణంగా వ్యవసాయ, ఆక్వా రంగాలతో పాటు విద్యుత్, రహదారుల వ్యవస్థలకు అపార నష్టం వాటిల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన వాస్తవ పరిస్థితులను, నష్టం అంచనాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని విశ్లేషిస్తూ కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల బాపట్ల జిల్లాపై తుపాను విరుచుకుపడినప్పటికీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని భారీగా నివారించగలిగారని ప్రశంసించారు. లోతట్టు ప్రాంతాల్లో నిరాశ్రయులైన వందలాది కుటుంబాలకు తక్షణమే పునరావాసం కల్పించడంతో పాటు, ప్రభుత్వ యంత్రాంగం పక్కాగా సర్వే నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్



డాక్టర్ వినోద్ కుమార్.వి మాట్లాడుతూ, మురసు తుపాను ప్రభావంతో జిల్లాలోని 15 మండలాలు ప్రభావితం కాగా, అందులో 9 మండలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మార్టూరు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, పర్చూరు, బాపట్ల, కారంచేడు మండలాల్లోని 21 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. ఈ విపత్తులో ముగ్గురు వ్యక్తులు, 28 జీవాలు మృత్యువాత పడగా, 1,470 గృహాలు నీట మునిగాయని వివరించారు. బాధితుల కోసం 153 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, నిరాశ్రయులైన 11,507 మందికి ఆశ్రయం, భోజన వసతి కల్పించామని చెప్పారు. మొత్తంగా బాపట్ల జిల్లాకు రూ.320.49 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ కేంద్ర బృందానికి నివేదించారు. ఈ విపత్తుతో 10,789 మంది తీవ్రంగా నష్టపోయారని, జీవనోపాధి కోల్పోయిన 13,214 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. వ్యవసాయ రంగంలో 4,129.42 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 140.608 హెక్టార్లలో ఉద్యాన పంటలకు రూ.45.438 లక్షల నష్టం వాటిల్లింది. రైతులకు చెందిన 6,251 ట్రాక్టర్లు దెబ్బతినడంతో రూ.9.89 కోట్లు, మత్స్యకారుల 302 బోట్లు, వలలు పాడవడంతో రూ.28.10 లక్షల మేర నష్టం జరిగింది. మౌలిక సదుపాయాల విషయానికొస్తే, 331.92 కిలోమీటర్ల మేర 94 ఆర్ అండ్ బి రహదారులు, 20 వంతెనలు దెబ్బతినడంతో రూ.204.86 కోట్లు, పంచాయతీరాజ్ రహదారులకు రూ.10.41 కోట్ల నష్టం సంభవించింది. నల్లమడ, ఓగేరు వాగు, నక్క వాగు, పర్చూరు వాగు, ఆలేరు కాల్వలతో పాటు మొత్తం 259 కాల్వలు దెబ్బతినడంతో రూ.55.44 కోట్ల నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖ పరిధిలో 698 (33 కేవీ), 3,443 (11 కేవీ), 2,064 (ఎల్‌టీ) స్తంభాలతో పాటు వందలాది కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, 141 సౌర విద్యుత్ పలకలు దెబ్బతినడంతో రూ.22.39 కోట్ల నష్టం నమోదైంది. అదనంగా 6,647 నివాస గృహాలు దెబ్బతినడంతో రూ.7.98 కోట్లు, బాపట్ల, రేపల్లె, చీరాల మున్సిపాలిటీలలో కాల్వలు, రహదారులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రూ.3.11 కోట్ల నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అదనపు అభివృద్ధి కమిషనర్ ప్రశాంత్ ఆర్మోరికర్, కేంద్ర ఆర్థిక, వ్యయ మంత్రిత్వ శాఖ సహాయ సంచాలకులు హిమాలయ గార్గ్, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ ఉప సంచాలకులు ప్రణయ్ గర్గ్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న మరియు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నగారా.. ఈ నెల 26న పోలింగ్

అనంతపురం తెలుగుకలం నవంబర్ 13 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు – 2026కు సంబంధించి మొదటి విడత ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలోని 13 మండలాల్లో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమావళి, 2006లోని 6వ నియమం క్రింద రిటర్నింగ్ అధికారి నవంబర్ 15న ఫారము-1లో ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అదే రోజు 5వ నియమం క్రింద వార్డు వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. నవంబర్ 15 నుండి 17వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. దాఖలైన నామినేషన్ల పరిశీలన నవంబర్ 18వ తేదీ ఉదయం 8.00 గంటల నుండి ప్రారంభమవుతుంది. తిరస్కరించబడిన నామినేషన్లపై అభ్యర్థులు నవంబర్ 19వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (అప్పీలేట్ అధికారి) వద్ద అప్పీలు చేసుకోవచ్చు. ఈ అప్పీళ్లను నవంబర్ 20వ తేదీన పరిష్కరిస్తారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నవంబర్ 21వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు గడువు ఉండగా, అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. మొదటి విడత పోలింగ్ నవంబర్ 26వ తేదీన ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2.00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు దేశవ్యాప్తంగా గణన ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. జిల్లా, చార్జ్ లెవెల్



లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 14(10) ప్రకారం ఫలితాలు వెలువడిన రోజే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు ఎన్నిక జరగకపోతే, మరుసటి రోజు సెలవు దినమైనప్పటికీ ఉప సర్పంచ్ ఎన్నికను తప్పనిసరిగా పూర్తి చేస్తారు. ఒకవేళ ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 27వ తేదీ ఉదయం 7.00 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2.00 గంటల నుండి ఓట్ల లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే 13 మండలాల్లో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కంబదూరు, సెట్టూరు, కుందుర్పి, రాయదుర్గం, డి.హీరేహాల్, బొమ్మనహాల్, కనేకల్, గుమ్మగట్ట మండలాలు ఉన్నాయి. అలాగే అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు జనగణన పునాది జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 13) : భారత రాజ్యాంగంలో జనాభా గణనకు ఇచ్చిన ప్రాముఖ్యత కారణంగా ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తోందని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జేఎన్‌టీయూలోని ఈఈఈ బ్లాక్ సెమినార్ హాల్‌లో జిల్లా మరియు చార్జ్ లెవెల్ అధికారుల జనాభా గణన ప్రక్రియ రెండవ దశ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన మొదటి దశ అయిన ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులను మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద పరిపాలన మరియు గణాంక ప్రక్రియ అయిన జనాభా గణన రెండవ దశ ప్రారంభమైందని తెలిపారు. 2027లో జరగనున్న ఈ జనాభా గణన దేశంలో 16వది కాగా, స్వాతంత్ర్యానంతరం 8వ జనాభా గణన అని ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు మరియు ఇతర అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. గ్రామ, పట్టణ మరియు వార్డు స్థాయిలో ప్రాథమిక డేటాను అందించే అతిపెద్ద మూలాధారం



సెన్సెస్ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల నివాసయోగ్య స్థితి, వసతులు, ఆస్తులు, మతం, ఎస్సీ, ఎస్టీ వివరాలు, భాష, అక్షరాస్యత, విద్య, ఆర్థిక కార్యకలాపాలు, వలసలు మరియు సంతాన వివరాల వంటి సూక్ష్మస్థాయి సమాచారాన్ని తప్పులు లేకుండా సేకరించాలన్నారు. ముఖ్యంగా ఇది భారతదేశంలో మొట్టమొదటి డిజిటల్ సెన్సెస్ కావడం వల్ల ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు తమ స్మార్ట్‌ఫోన్లలో ప్రత్యేక మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరించడంతో పాటు, కుటుంబాలు ఒక నిర్దిష్ట పోర్టల్ ద్వారా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కూడా కల్పించబడిందని తెలిపారు. 2027 జనవరి 10 నుంచి 24 వరకు రెండవ విడత స్వీయ నమోదుకు అవకాశం ఉంటుందని,



అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి మరియు ప్రజలకు ఉన్న సందేహాలను, అపోహలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. దేశ ప్రణాళిక మరియు సమగ్ర అభివృద్ధికి ఈ డేటా అత్యంత కీలకమని ఆయన అన్నారు. కార్యక్రమం అనంతరం సెన్సెస్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జనాభా గణన ప్రక్రియ విధివిధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో మాలోల, సెన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహ, జనగణన ఏడీ డెహొరీ, అనంతపురం ఆర్డీవో ప్రేమాంత్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, సీపీవో బాలాజీ నాయక్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగం పర్యవేక్షకురాలు యోగేశ్వరి దేవి, సెన్సెస్ డీటీ మధుసూదన్ రావు, ఎస్వో గిరిధర్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మాస్టర్ ట్రైనర్లు, ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకులు జి.ఎల్.ఎన్. ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల ఉపాధిపై 'స్మార్ట్ సిటీ' వేటు 50 కుటుంబాల పాట్ట కొట్టవద్దు!

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 13) : నగరంలో గత ఇరవై ఏళ్లుగా ఐచర్, బొలెరో వాహనాల స్టాండ్‌ను నమ్ముకొని జీవనం సాగిస్తున్న సుమారు యాభై కుటుంబాల ఉపాధిని దెబ్బతీయవద్దని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఐచర్, బొలెరో వాహన యజమానులు, డ్రైవర్లతో కలిసి ఆయన అనంతపురం మున్సిపల్ కమిషనర్ ఎం. జశ్వంత్ రావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, స్టాండ్‌ను తొలగించవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ, నగరంలోని బళ్లారి రోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు మధ్య ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గత రెండు దశాబ్దాలుగా ఐచర్, బొలెరో వాహనాల స్టాండ్ కొనసాగుతోందని తెలిపారు. ఇక్కడ వాహనాలను నిలిపి బాడుగలకు వెళ్తూ సుమారు యాభై కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయని వివరించారు. అయితే, ప్రస్తుతం స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ స్టాండ్‌ను తొలగించి వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించడంతో వాహన యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా బాడుగల కోసం నగర ప్రజలకు ఒక స్థిరమైన కేంద్రంగా గుర్తింపు పొందిన ఈ స్టాండ్‌ను అకస్మాత్తుగా తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడే



ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకొని, ఇప్పటివరకు కొనసాగుతున్న ప్రదేశంలోనే వాహనాలకు స్టాండ్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కొంత భాగాన్ని మాత్రమే స్టాండ్ కోసం కేటాయించాలని గతంలో జిల్లా కలెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించడం సంతోషకరమని గుర్తు చేశారు. తమకు జీవనాధారంగా ఉన్న స్టాండ్‌ను పూర్తిగా తొలగించకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, యాభై కుటుంబాలకు న్యాయం చేయాలని సాకే హరి మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులతో పాటు వాహన యజమానులు రామాంజనేయులు, శ్రీనివాసులు, రాజు, హరినాథ్, రామయ్య, ధనుంజయ, రాధాకృష్ణ, షబ్బీర్, రవి నాయక్, కాశీం, గజరాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనాభా గణన-2027 పై ఉద్యోగులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం



అనంతపురం తెలుగుకలం నవంబర్ 13 : భారతదేశ జనాభా గణన-2027 రెండో విడత ప్రక్రియలో భాగంగా స్థానిక జేఎన్టీయూలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం సభా మందిరంలో క్షేత్రస్థాయి శిక్షకులకు శుక్రవారం అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలోల, అనంతపురం, కళ్యాణదుర్గం ఆర్డీవోలు ప్రేమ్ మంత్ కుమార్, వసంత బాబు, ప్రధాన శిక్షకులు జి.ఎల్.ఎన్. ప్రసాద్, కిరణ్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాలోల మాట్లాడుతూ జనాభా గణన ఉద్యోగులు క్షేత్రస్థాయిలో అత్యంత నాణ్యమైన డేటా సేకరణ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. జనాభా గణనలోని చట్టపరమైన అంశాలను ప్రజలకు ఓర్పు, సహనంతో వివరించి వారిలో నెలకొన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాలని, ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాన్ని స్పష్టం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే సమయంలో అధికారులు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ నెల 12 నుండి 18వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని, జనాభా గణనలో గల వివిధ దశలను, సూచనల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని, ముఖ్యం

భవిష్యత్ అంతా టూరిజం రంగానిదే.. ఇన్వెస్టర్లకు ఏపీ ప్రభుత్వం పూర్తి భరోసా: మంత్రి కందుల దుర్గేష్

విశాఖపట్నం (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని, భవిష్యత్ అంతా టూరిజం రంగానిదే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు కార్యక్రమంలో ఆయన కీలక ప్రసంగం చేశారు. ఇన్వెస్టర్లను "ఫ్రెండ్స్" అని ఆత్మీయంగా సంబోధిస్తూ, "పెట్టుబడులు పెట్టండి.. వాటి రక్షణ, ప్రోత్సాహకాల బాధ్యత మాది" అని భరోసా ఇచ్చారు. ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టే ఈ మహాయజ్ఞంలో ఇన్వెస్టర్లందరూ భాగస్వాములు కావాలని, ఇక్కడ పెట్టే ప్రతి రూపాయి రాష్ట్ర అభివృద్ధికి, లక్షలాది కుటుంబాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో టూరిస్టులకు కేవలం అనుభవాలు, జ్ఞాపకాలు మాత్రమే మిగులుతాయని, కానీ ఏపీలో అదనంగా ప్రజల ఆప్యాయత, గౌరవం లభిస్తాయని పేర్కొనడంతో ఇన్వెస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. సదస్సు రెండో రోజున మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో రూ. 860 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులతో ఎంఓయూలు, రూ. 336 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులతో జీవోల మార్పిడి జరిగింది. ఇందులో భాగంగా కివా హోటల్ అండ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ (కుప్పం), బాపురం గ్రాండ్ హోటల్స్ (కర్నూలు), హిల్లోరా ఎకో రిసార్ట్ (కృష్ణాపురం, విజయనగరం), జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ ఎల్ఎల్ పీ (రాజమహేంద్రవరం), రేడియన్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్ పీ (విజయనగరం), శ్రీవెన్ గ్రూప్ ఎల్ఎల్ పీ (విశాఖపట్నం), పీఆర్ హోటల్స్ అండ్ కన్వెన్షన్ సెంటర్ (విశాఖపట్నం), ఎంటీజే ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం), శ్రీ సిద్ధార్థ ఇన్ ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్



లిమిటెడ్ (విశాఖ), న్యూ ఏజ్ మీడియా పార్ట్ నర్ ప్రైవేట్ లిమిటెడ్ (వివిధ జిల్లాల్లో) సంస్థలతో ఎంఓయూలు కుదిరాయి. అదేవిధంగా తిరుపతిలో ఆర్ కే2 ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డైవిక్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో జీవోల మార్పిడి జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ 'పారిశ్రామిక హోదా' కల్పించారని గుర్తుచేశారు. దీనివల్ల పరిశ్రమలకు వర్తించే అన్ని రాయితీలు టూరిజం ఇన్వెస్టర్లకు అందుతున్నాయని, ఫలితంగా గడిచిన రెండున్నరేళ్లలో దేశవిదేశాల నుండి సుమారు రూ. 20,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు. రాష్ట్రానికి ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి, ఎన్ని గదులు నిర్మించామన్న దానికంటే స్థానిక నిరుద్యోగ యువతకు, మహిళలకు ఎంతమేర ఉపాధి లభిస్తుందన్నదే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. మనం హిమాలయ స్థాయి ఎత్తుకు ఎదిగినా, అంతిమంగా క్షేత్రస్థాయిలోని సామాన్యుడికి కల్పనీ, హస్తకళలు, టూరిస్ట్ గైడ్ల ద్వారా లబ్ధి జరిగి జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. 'అథెంటిసిటీ, హ్యూమన్ వార్మ్త్, అతిథి దేవోభవ' అనే విధానాలతో పాటు 'గ్లోబల్ స్టాండర్డ్స్ విత్ లోకల్ కల్చర్' నినాదంతో కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు పొందిన అరకు కాఫీ, కలంకారీ కళ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి కొనియాడారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం, అరకు వ్యాలీ, లంబసింగి, గండికోట, కోనసీమ, గోదావరి-కృష్ణా నదీతీరాలు, బౌద్ధ ఆరామాలతో యావత్ భారతదేశాన్ని ఒక్క ఏపీలోనే దర్శించుకోవచ్చని అభివర్ణించారు. సముద్రతీరంతో పాటు అరకు, లంబసింగి, హార్సిలీహిల్స్ ప్రాంతాల్లో యోగా, ఆయుర్వేద ఆధారిత 'వెల్‌నెస్ సెంటర్ల' ఏర్పాటుకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖ, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో నిర్వహించిన 5 ప్రాంతీయ సదస్సుల ద్వారా 50 ప్రాజెక్టులు, సీఐఐ సమ్మిట్ ద్వారా 12 ప్రాజెక్టులతో కలిపి మొత్తంగా 62 ప్రాజెక్టులకు పర్యాటక శాఖ ఎంఓయూలు కుదుర్చుకుందని వివరించారు. వీటి ద్వారా రాష్ట్రానికి రూ. 7,287.30 కోట్ల పెట్టుబడులు (సీఐఐ సమ్మిట్ వాటా రూ. 1,114.92 కోట్లు) రానుండగా, 5,000కు పైగా హోటల్ గదుల వసతితో పాటు 46,853 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, కార్యదర్శి ఆమ్రపాలి కాట, టూరిజం ఎండీ పట్టాన్‌శెట్టి రవి సుభాష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ఇన్వెస్టర్లకు 'ఏపీ పర్యాటక పాలసీ 2024-29' రాయితీలను వివరించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్, అధికారులు సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు.

మున్సిపల్ పరోక్ష ఎన్నికల నిర్వహణలో కమిషన్ నిబంధనలు తప్పనిసరి కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు తెలుగుకలం నవంబర్ 13 : కర్నూలు నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీలలో వైస్ చైర్మన్ల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ. సిరి ఆదేశించారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరోక్ష ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 23న నిర్వహించనున్న డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన వివరణాత్మక సర్క్యులర్ మార్గదర్శకాలను అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ముందస్తు ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక



సమావేశానికి మూడు రోజుల ముందుగానే సభ్యులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో తొలుత మేయర్ లేదా చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం మిగిలిన ఎన్నికైన సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించాలని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తయిన తర్వాతే డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను చేపట్టాలన్నారు. ప్రత్యేక సమావేశానికి అవసరమైన కోరం ఉండేలా చూసుకోవాలని, ఎక్స్-అఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగంపై ఉన్న నిబంధనల పట్ల అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. అలాగే, సభా వేదిక వద్ద జాతీయ పార్టీలు, గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీల సభ్యులకు వేర్వేరు కంపార్ట్‌మెంట్లుగా సీటింగ్ ఏర్పాటు చేసి, ఆయా పార్టీల పేర్లతో స్టిక్కరింగ్ చేయడం ద్వారా సభ్యులను సులభంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ నిర్వహణ, ప్రమాణ స్వీకారం, కోరం, నామినేషన్ ఫారాలు, పార్టీ విప్ జారీ తదితర అంశాలపై కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, గూడూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు భారీ నజరానా

రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకం పెంపు

2026 సాధారణ ఎన్నికలకు జి.ఓ.ఆర్.టి. నెం.1111

ద్వారా ఉత్తర్వులు జారీ : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : గ్రామాల్లో సామరస్యం, ఐక్యత, పరస్పర సహకార భావనను పెంపొందించి, ఎన్నికల సమయంలో తలెత్తే వర్గ విభేదాలు, వివాదాలను తగ్గించడంతో పాటు ఏకాభిప్రాయంతో కూడిన స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే ఏకగ్రీవ ఎన్నికల ప్రోత్సాహక నగదును గణనీయంగా పెంచిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం తెలిపారు. 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన పెంచిన ప్రోత్సాహక మొత్తాలను అందించాలని ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.1111 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. నూతన ఉత్తర్వుల ప్రకారం 5,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.25 లక్షలు, అలాగే 10,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదును అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. గతంలో 2,000 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10



లక్షలు, 5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 10,000కు పైగా జనాభా కలిగిన పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందించేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ఈ మొత్తాలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రోత్సాహక నిబంధనల గురించి కలెక్టర్ స్పష్టం చేస్తూ, సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు సంబంధిత చట్టాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ నగదు వర్తిస్తుందన్నారు. నిధుల విడుదలకు ముందు సంబంధిత అధికారులు ఆయా గ్రామ పంచాయతీల అర్హతను క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ఈ మొత్తాన్ని సంబంధిత గ్రామ పంచాయతీల పరిధిలో ఆమోదించిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వినియోగించాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి నిర్దేశించిన ఆర్థిక, లెక్కల నిర్వహణ, ఆడిట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పదవీకాలంలో ఈ మొత్తాన్ని దశలవారీగా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదే సమయంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే చట్టబద్ధమైన హక్కు ఉంటుందని, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, స్వతంత్రంగా వినియోగించుకునే హక్కుకు ఈ పథకం ఎలాంటి భంగం కలిగించదని స్పష్టం చేశారు. ఏకగ్రీవ ఎన్నికల ద్వారా లభించే ప్రోత్సాహకాలపై గ్రామ పంచాయతీలు, గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల వివరాలను జనాభా వర్గాల వారీగా సేకరించి, అవసరమైన ఆర్థిక నిధుల అంచనాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రోత్సాహక పథకం కేవలం 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు మాత్రమే వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

హాస్పిటల్ కాలనీలో పర్యటించిన ఎంపీటీసీ నంద్యాల ఆదిలక్ష్మి



యాడికి నవంబర్ 13 (తెలుగుకలం) : యాడికి మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీ 5వ వార్డులో శుక్రవారం ఎంపీటీసీ సభ్యురాలు నంద్యాల ఆదిలక్ష్మి పర్యటించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తన గెలుపునకు సహకరించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనలో వీధిలైట్ల సమస్యను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా,వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. భవిష్యత్తులో కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి సహకారంతో పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు.ఈ కార్య క్రమంలో నంద్యాల రంగస్వామి,బాలం శ్రీనివాసులు,గొందిపల్లె రామాంజ నేయులు,వీరన్న,పల్లె రమేష్,శంకర, కళ్లెముని,రామ కృష్ణ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుల స్థానంలో నిలిచి అంత్యక్రియలు నిర్వహణ



యాడికి నవంబర్ 13 (తెలుగుకలం) : యాడికి మండల కేంద్రానికి చెందిన క్షీరసాగరం సక్కుబాయి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది .. అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ముందుకు రాకపోవడంతో విషయం తెలుసుకున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు మృతురాలి కుటుంబానికి అండగా నిలిచి, దగ్గరుండి సంప్రదాయబద్ధంగా అంత్యక్రి యలు నిర్వహించారు.కుమారుల స్థానం లో నిలిచి మానవత్వాన్ని చాటుకున్న ఫౌండేషన్ సభ్యులను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు చందగాని ధ్రువనారాయణ, కార్యదర్శి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి,సభ్యులు గాంధీజీ స్కూల్ రామమోహన్,సాకరే శంకరప్ప,టి. లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఓవర్‌లోడ్ ఇసుక లారీల సీజ్

పోలీసుల కఠిన చర్యలు

తాడిపత్రి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వస్తున్న ఐదు ఇసుక లారీలను తాడిపత్రి రూరల్ పోలీసులు గురువారం ఉదయం విజయవంతంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఎల్లనూరు వైపు నుంచి తాడిపత్రి పట్టణ వైపు వస్తున్న లారీలను తనిఖీ చేయగా, వాటిలో అనుమతికి మించి అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్నట్లు బయటపడింది. రవాణా నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఇసుకను తరలిస్తున్న ఈ ఐదు లారీలను పోలీసులు తక్షణమే సీజ్ చేశారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు మరియు తనిఖీల నిమిత్తం ఆ లారీలను తాడిపత్రి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తాడిపత్రి రూరల్ సీఐ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, వాహనదారులు అందరూ రోడ్డు రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించి అధిక లోడుతో వాహనాలను నడిపితే ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఇలాంటి అక్రమ రవాణాపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ముంబై భక్తుడి బంగారు హారం కానుక



విజయవాడ (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు తమ భక్తిశ్రద్ధలతో విలువైన బంగారు కానుకను సమర్పించారు. మహారాష్ట్రలోని ముంబై (చెంబూరు) ప్రాంతానికి చెందిన భక్తులు శ్రీ జి.వి. వంశీకృష్ణ గారు శుక్రవారం (13.11.2026) అమ్మవారికి 38.700 గ్రాముల (ముప్పై ఎనిమిది గ్రాముల ఏడు వందల మిల్లీగ్రాములు) బరువు గల బంగారు హారాన్ని భక్తితో సమర్పించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన దాత శ్రీ జి.వి. వంశీకృష్ణ గారు ఈ బంగారు హారాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీ సీనా నాయక్ గారికి అందజేశారు. కానుకను స్వీకరించిన ఆలయ అధికారులు దానికి సంబంధించిన అధికారిక రసీదును దాతకు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో దాతకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు దాతకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో

నరసాపురంలో పోలీసుల అవగాహన సదస్సు



శింగనమల తెలుగుకలం నవంబర్ 13 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శింగనమల మండలం, రాజకీయంగా సమస్యాత్మక గ్రామమైన నరసాపురం గ్రామంలో పోలీసు అధికారులు గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శింగనమల పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఎన్నికల నియమావళిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు పాటించాల్సిన నిబంధనలను, చేయకూడని పనులను ఆయన వివరంగా తెలియజేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. గ్రామంలోని రౌడీ షీటర్లు, అల్లరి మూకలకు ఈ సందర్భంగా కఠిన హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడ్ ఆటోలపై పోలీసుల కొరడా

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ తప్పదని హెచ్చరిక



మదనపల్లి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మదనపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సూచనలు, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా తన సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు కూడళ్లలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు ద్విచక్ర వాహనాలు నడుపుకుంటూ వెళ్తున్న మైనర్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. అదేవిధంగా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటోలను నిలిపివేసి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, ఓవర్ లోడింగ్ వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తెలియక చేసిన తప్పుగా భావించి ప్రస్తుతానికి హెచ్చరించి వదిలేస్తున్నామని సీఐ చాంద్ బాషా విద్యార్థులకు స్పష్టం చేశారు. ఇకపై మైనర్ విద్యార్థులు వాహనాలు నడుపుతూ పాఠశాలలు లేదా కళాశాలలకు వస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే విద్యార్థుల తల్లిదండ్రులను మదనపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేసి మదనపల్లి వన్ టౌన్ లేదా టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగిస్తామని చెప్పారు. భారీ జరిమానాలు విధించడంతో పాటు మైనర్లపై కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ సీఐ స్పష్టం చేశారు.

19న ఓర్వకల్లు ఎంపీపీ పీఠానికి ఎన్నిక..

ఎంపీటీసీలకు నోటీసులు జారీ

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరికి ఆహ్వాన లేఖలు



ఓర్వకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : ఓర్వకల్లు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష పదవుల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన జరగనున్న ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అధికారిక లాంఛనాలను వేగవంతం చేశారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న సతీష్ కుమార్, ఎక్స్-అఫీషియో సభ్యుల హోదాలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి ప్రత్యేకంగా ఆహ్వాన లేఖలను పంపించారు. ?మరోవైపు, ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాల్సిందిగా కోరుతూ మండలంలోని ఎంపీటీసీ సభ్యులందరికీ ప్రిసైడింగ్ అధికారి సతీష్ కుమార్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి నాగ అనసూయ అధికారిక నోటీసులు జారీ చేశారు. ఈ నెల 19న ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో నిబంధనల ప్రకారం ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అధికారులు అన్ని విధాలా చర్యలు చేపట్టారు.

ఎన్నికల్లో సహకరించిన ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు

అనంతపురం మేయర్ రమేష్ గౌడ్



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న చాందిని మసీదులో ముస్లిం, మైనార్టీలతో కలిసి మేయర్ రమేష్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని వారిని అభినందించారు. ఎన్నికల సమయంలో వారు అందించిన సహకారానికి, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజల సమష్టి సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని మేయర్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని కులాలు, సంఘాల వారు పార్టీకి అందించిన మద్దతును ఎప్పటికీ గుర్తుంచుకుంటానని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అన్ని వర్గాల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చిన ఆయన, నగర సర్వతోముఖాభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మాజీ కార్పొరేటర్లు ఇషాక్, అశోక్ రెడ్డితో పాటు ముస్లిం, మైనార్టీ నాయకులు హిద్దు, షకీల్, సవిద్, జిలాన్, ఫయాజ్, ఆరిఫ్, కరీం, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు అనంతపురం ప్రసన్నాయపల్లి మధ్య 126వ నంబర్ లెవెల్ క్రాసింగ్ గేట్ తాత్కాలిక మూసివేత



అనంతపురం తెలుగుకలం నవంబర్ 13 : రైల్వే ట్రాక్ నిర్వహణ పనుల దృష్ట్యా ప్రసన్నాయపల్లి – అనం

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 11 - 2026

మదనపల్లెలో ఘనంగా ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు



మదనపల్లి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : ఫోర్డ్ మరియు క్రై సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మదనపల్లెలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా వాల్మీకి నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్ మరియు వడ్డేపల్లిలోని దివ్య జ్యోతి మున్సిపల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు నినాదాలు చేస్తూ స్థానిక ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ, నవంబర్ 14న జరిగే బాలల దినోత్సవం నుండి నవంబర్ 20న నిర్వహించే బాలల హక్కుల దినోత్సవం వరకు వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బాలల సంఘాల సభ్యులకు నృత్య పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీసి మెరుగుపరచడంతో పాటు, బాలల హక్కుల పరిరక్షణపై తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతమైన చర్యలు తీసుకునేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, సిబిఓ సభ్యులు పిసి నిర్మల, ఎంఐఎస్ గౌరీ, శ్యామల, సుభాషిణి, స్వర్ణలత, ఎం. నరసింహ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలకు వ్యతిరేకంగా
కరకంబాడి పంచాయతీలో సంతకాల సేకరణ



రేణిగుంట తెలుగుకలం నవంబర్ 13 : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరియు రానున్న ఎన్నికల్లో ఏకగ్రీవాలకు వ్యతిరేకంగా కరకంబాడి పంచాయతీ పరిధిలోని 16 పల్లెల్లో అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గత మూడు నాలుగు రోజులుగా సంఘం ప్రతినిధులు అన్ని పల్లెల్లో పర్యటించి, స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా రేణిగుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభివృద్ధి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గత ఎంపీటీసీ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అంతేకాకుండా నామినేషన్ల ప్రక్రియలో అడ్డంకులు సృష్టించడం, పోటీ చేసే అభ్యర్థులపై ఒత్తిళ్లు తీసుకురావడం వంటి ఘటనల వల్ల ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా అత్యంత స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఏకగ్రీవాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం నామినేషన్ల దాఖలు విధానాన్ని మీడియా ప్రతినిధులు నేరుగా పరిశీలించేందుకు అధికారులు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి సేకరించిన ఈ సంతకాల పత్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీడీవో తదితర ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. మీడియా సమావేశం అనంతరం వారు నేరుగా వెళ్లి సంతకాల పత్రాలను రేణిగుంట ఎంపీడీవోకు అందజేశారు. సీఐటీయూ మండల నాయకులు సెల్వరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అభివృద్ధి సంఘం కార్యకర్తలు సత్యశ్రీ, రాజశేఖర్, శివానందం తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిధుల గోల్‌మాల్ కలకలం..
ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు



బద్వేల్ (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : కడప జిల్లా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిధుల గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆసుపత్రికి సంబంధించిన బ్లడ్ బ్యాంక్, ఐసీడీసీ విభాగంలో పనిచేస్తున్న ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఆసుపత్రి పరిపాలనా వ్యవహారాల్లో అధికంగా జోక్యం చేసుకుంటూ, వైద్యులను సైతం ప్రభావితం (మానిప్యులేట్) చేస్తున్నారంటూ గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ తనిఖీల సందర్భంగా విచారణాధికారి మాట్లాడుతూ, సదరు ల్యాబ్ టెక్నీషియన్‌పై గతంలోనే ఆరోపణలు వచ్చినప్పుడు, ఆయనను ఆసుపత్రి విధుల్లో భాగస్వామ్యం చేయకూడదని మెడికల్ ఆఫీసర్‌కు స్పష్టంగా సూచించినట్లు తెలిపారు. ఆ ఉద్యోగి తమ శాఖకు చెందిన వ్యక్తి కాదని, బ్లడ్ బ్యాంక్ మరియు ఐసీడీసీ విభాగాలకు సంబంధించిన వారని స్పష్టం చేస్తూ, ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత శాఖాధికారులతో కూడా చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిశీలనలో బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కచ్చితంగా లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని తేలిందని అధికారులు వెల్లడించారు. నిధుల దుర్వినియోగం ఎక్కడ జరిగింది, ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉంది అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎంతటి స్థాయి అధికారులు ఉన్నా, తప్పు చేసినట్లు తేలితే ఎవరినీ ఉపేక్షించబోమని, కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులు, సందర్శకులతో మాట్లాడి సిబ్బంది వ్యవహార శైలి మరియు సేవల తీరుపై ఆరా తీశారు. గతంలో వెలుగులోకి వచ్చిన నిధుల గోల్‌మాల్ అంశంలో తిరిగి అదే ల్యాబ్ టెక్నీషియన్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో, ఈ పూర్తి నివేదికను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

ఆలయాల పునరుద్ధరణ పనులను
క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



రాయచోటి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అన్నమయ్య జిల్లా రాయచోటి, పీలేరు, కలికిరి మండలాల్లో ఆలయాల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఈ ప్రాంతాల్లో పర్యటించి, వివిధ ఆలయాల్లో జరుగుతున్న పునరుద్ధరణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయాల వారీగా మంజూరైన నిధులు, ఇప్పటివరకు చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితిగతుల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా రాయచోటి మండలం మాసాపేట పరిధిలోని శ్రీ దేవకీ యశోద కృష్ణ ఆలయ పునర్నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఆలయాభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలయాల పునర్నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని హెచ్చరించారు. మంజూరైన ప్రతి రూపాయిని నిర్దేశిత పనులకే సద్వినియోగం చేయాలని సూచించారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ అభివృద్ధికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు



గుంటూరు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : కేంద్ర గ్రామీణ అభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో గుంటూరులోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధునిక సదుపాయాలతో త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. స్టడీ సర్కిల్‌లో అదనపు వసతుల కల్పన కోసం పెమ్మసాని రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం తెలిపింది. ఈ మేరకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాంఘిక సంక్షేమ శాఖ బడ్జెట్ నుంచి నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిధులతో గుంటూరు నగరంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్-కమ్-స్టడీ సర్కిల్‌కు రెండో అంతస్తు (++2) నిర్మాణం చేపట్టనున్నారు. విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు వీలుగా ఆధునిక ఫర్నిచర్‌తో కూడిన విశాలమైన లైబ్రరీ హాల్‌ను నిర్మించనున్నారు. వీటితో పాటు నిరంతర విద్యుత్ సదుపాయం, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు ఇబ్బందులు లేకుండా 50 కేవీఏ సామర్థ్యం గల డీజిల్ జనరేటర్, పది మంది ప్రయాణించే సామర్థ్యంతో కూడిన లిఫ్ట్, స్వచ్ఛమైన తాగునీరు మరియు మెరుగైన పారిశుధ్య వసతులను ఏర్పాటు చేయనున్నారు. గతంలో 2019 ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం ఈ స్టడీ సర్కిల్ అభివృద్ధి కోసం రూ. 6.4 కోట్లు మంజూరు చేసినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టడంతో పనులు నిలిచిపోయి విద్యార్థులకు నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం పెమ్మసాని చొరవతో మళ్లీ నిధులు మంజూరు కావడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థుల కలలకు మరో అడుగు ముందుకు పడినట్లయింది. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల చదువుకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన వసతులు, అవకాశాలు లేక వెనుకబడుతున్న పేద విద్యార్థులకు ఈ స్టడీ సర్కిల్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాల సాధనకు ఇది ఒక చక్కటి వేదికగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య ద్వారానే సామాజిక అభ్యున్నతి సాధ్యమన్న సంకల్పంతో చేస్తున్న కృషిలో ఇది ఒక కీలక ముందడుగు అని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనలకు స్పందించి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులుకు, అలాగే జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ మరియు ఇతర జిల్లా అధికారులకు పెమ్మసాని హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా లఘు చిత్రాల పోటీల విజేతలకు నగదు బహుమతుల ప్రదానం



పుట్టపర్తి తెలుగుకలం నవంబర్ 13 : బాలికలను విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసం గలవారిగా తీర్చిదిద్దినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ వద్ద గల రెవెన్యూ భవన్‌లో జిల్లా స్థాయి లఘు చిత్రాల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, పుట్టపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు కలెక్టర్ చేతులమీదుగా నగదు చెక్కులను అందజేశారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం మరియు లింగ సమానత్వంపై విద్యార్థులతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో గత సెప్టెంబర్ 29న కదిరిలోని ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్లు-1, 2 సహకారంతో జిల్లా స్థాయి లఘు చిత్రాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కదిరి ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మడకశిర ఎస్.వై.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు బుక్కపట్నం ఎస్.ఎస్.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలికల విద్య, బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్ష, భ్రూణ హత్యల నివారణ, మానవ అక్రమ రవాణా తదితర సామాజిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. లఘు చిత్రాల సామాజిక సందేశం, సృజనాత్మకత, సాంకేతిక నాణ్యత ఆధారంగా న్యాయమూర్తులు విజేతలను ఎంపిక చేశారు. ఇందులో కదిరి ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్. బాషా రూపొందించిన "సేవ్ ది గర్ల్ చైల్డ్" లఘు చిత్రానికి ప్రథమ బహుమతి కింద రూ. 30,000 నగదు చెక్కు లభించింది. హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్. గౌతమి రూపొందించిన "బాలికల అక్రమ రవాణా" చిత్రానికి ద్వితీయ బహుమతిగా రూ. 20,000, మడకశిర ఎస్.వై.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి. రజియా బాను రూపొందించిన "ఆన్‌లైన్ సైబర్ నేరాలు" చిత్రానికి తృతీయ బహుమతిగా రూ. 10,000 నగదు చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఈ పోటీలకు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా, పుట్టపర్తి వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ మహేశ్వర మారుతి, జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి సి. సుబ్రహ్మణ్యం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం. రామచంద్ర, అధ్యాపకులు డాక్టర్ టి.టి.పి. మోహన్ బాబు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆర్. హైదర్ అలీ, డాక్టర్ వి. చంద్రశేఖర్ నాయక్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. ఫీరోజా బేగం, డాక్టర్ మహేశ్వర మారుతి, సీడీపీఓ జయంతి, డెమో సెక్షన్ సిబ్బంది, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎం. కృష్ణ నాయక్, ఎస్. యాసిన్ పీర్, అధ్యాపకులు, వాలంటీర్లు, విద్యార్థులు మరియు ఆరోగ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





జిల్లాలో టన్ను ఇసుక ధర రూ. 158/- గా ఖరారు చిత్రావతి రిజర్వాయర్‌లో నూతన ఇసుక బ్లాకులకు గ్రీన్ సిగ్నల్



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 13) : శ్రీ సత్యసాయి జిల్లాలో ఇసుక లభ్యత, నూతన డీ-సిల్టేషన్ పాయింట్ల కేటాయింపు, ఇసుక ధరల నిర్ణయం మరియు అక్రమ ఇసుక రవాణా నియంత్రణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో జీవనదులు లేనందున స్థానిక గృహ నిర్మాణ అవసరాల కోసం 83 ఒకటవ, రెండవ, మూడవ ఆర్డర్ వాగుల ద్వారా ప్రజలకు ఉచితంగా ఇసుకను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. వాణిజ్య మరియు ప్రభుత్వ బల్క్ పనుల కోసం తాడిమర్రి మండలం, సి.సి. రేవు గ్రామంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి డీ-సిల్టేషన్ ద్వారా ఇసుకను సరఫరా చేయాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాలోని డీ-సిల్టేషన్ పాయింట్లలో ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఫోర్‌షోర్ ఏరియా లో నూతనంగా డీ-సిల్టేషన్ చేపట్టేందుకు ఆహ్వానించిన టెండర్లకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా బ్లాక్ నం. 25 మరియు 26 (15,050 మెట్రిక్ టన్నులు) కు హిందూపురానికి చెందిన యాదవ చంద్రశేఖర్, బ్లాక్ నం. 29 మరియు 30 (15,300 మెట్రిక్ టన్నులు) కు అనంతపురానికి చెందిన తల్లూరి శ్రీధర్ తక్కువ ధరలను కోట్ చేసి ఎల్1 **(L1)** బిడ్డర్లుగా ఎంపికయ్యారు. ఈ రెండు బ్లాకులు పక్కపక్కనే ఉన్నందున స్టాక్ పాయింట్ వద్ద ఇసుక విక్రయ ధరను టన్నుకు రూ. 112/- గా నిర్ణయించారు. దీనికి అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు రూ. 36, సీటీఈ/సీటీఓ **(CTE/CTO)** ఫీజు రూ. 2.50, మరియు 5 శాతం జీఎస్టీ రూ. 7.50 కలుపుకొని వినియోగదారులకు అందజేసే తుది ధరను టన్నుకు రూ. 158/- గా కమిటీ ఖరారు చేసింది. ఎంపికైన ఏజెన్సీలకు తక్షణమే వర్క్ ఆర్డర్లు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి గ్రామంలోని పట్టా భూమిలో (సర్వే నం. 129-2, 130 మరియు 131) డీ-కాస్టింగ్ అనుమతి పొందిన ప్రక్రియలో ఇంకా 18,230 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ అందుబాటులో ఉన్నట్లు కమిటీ సమీక్షించింది. అలాగే హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి **(NH-44)** సెక్షన్‌లో వియూపీలు **(VUPs)** మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న ఎం/ఎస్ లెక్‌కాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 29,796 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం ఉన్న దృష్ట్యా, బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి (ణ. చెర్లోపల్లి) పాత స్టాక్ పాయింట్ వద్ద నిల్వ ఉన్న 8,742 మెట్రిక్ టన్నుల (5,828 **Cbm**) ఇసుకను కేటాయించేందుకు కమిటీ అంగీకరించింది. ఈ కేటాయింపులో ప్రతి టన్నుకు అడ్మిన్ చార్జీలు వసూలు చేయడంతో పాటు, సంబంధిత పట్టాదారుకు బకాయి ఉన్న భూమి అద్దె చెల్లింపు బాధ్యతను సదరు కాంట్రాక్టర్‌కే అప్పగించాలని నిర్ణయించారు. ఏపీ మైనర్ మినరల్ పాలసీ 2025 ప్రకారం అక్రమ మైనింగ్, నిల్వ మరియు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారి వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం మొదటిసారి పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ. 10,000/-, 10 టైర్ల లారీకి రూ. 25,000/-, 10 టైర్లకు పైబడిన లారీ లేదా మెషినరీకి రూ. 50,000/- జరిమానా విధించనుండగా, రెండవసారి పట్టుబడితే రూ. 1,00,000/- వరకు జరిమానా వసూలు చేయనున్నారు. ఇప్పటివరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 173 కేసులు నమోదు చేసి రూ. 20,92,800/- జరిమానా వసూలు చేయగా, 2026-27 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 30, 2026 నాటికి 114 కేసులు నమోదు చేసి రూ. 20,15,050/- జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ ఏడీ అమీర్ బాషా, గ్రౌండ్ వాటర్ డీడీ రాజశేఖర్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ ఎస్. ఉమామహేశ్వర రావు, ధర్మవరం ఆర్డీఓ రామభూపాల్ రెడ్డి, పులివెందుల పీబీసీ ఈఈ డి. వెంకటేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ గంగాధర్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



యువత స్వచ్ఛందంగా హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 13) : వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు యువతీ యువకులు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్.ఐ.వి. నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్.ఐ.వి. నియంత్రణ చర్యలు మరియు రక్తనిధి కేంద్రాల పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పెళ్లికి ముందు హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆకర్షణీయమైన గోడ పత్రికలను రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనూ, అలాగే హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరీక్షలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు గుర్తించని బాధితులను పరీక్షల ద్వారా గుర్తించి, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ వెంటనే మెరుగైన ఏ.ఆర్.టి. చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా సుఖవ్యాధి చికిత్సా కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలని, ఈ కేంద్రాలకు చికిత్స నిమిత్తం వచ్చే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని రక్తనిధి కేంద్రాలు అవసరమైన మేరకు రక్తనిల్వలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని, జిల్లాలో ఎక్కడా రక్తం కొరత అనే మాట వినిపించకూడదని హెచ్చరించారు. ఇందుకోసం ప్రతి రక్తనిధి కేంద్రం తరచుగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను, రక్త నిర్ధారణ క్యాంపులను నిర్వహించాలని తెలిపారు. ఐసిడిఎస్, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్మికులు, అవసరమైన వర్గాలందరికీ హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకుముందు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ జిల్లాలో అమలవుతున్న హెచ్.ఐ.వి. నియంత్రణ కార్యక్రమాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీ.వి. రమణ, హిందూపురం బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డా. లక్ష్మీ ప్రసాద్, బత్తలపల్లి ఏ.ఆర్.టి. కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమచంద్ర పాల్గొన్నారు. వీరితో పాటు సిబ్బంది ఈ.వి. రమణ, నారాయణ స్వామి, డీఆర్‌పీ రమేష్ మరియు ఫోర్డ్, చైతన్య, జనజాగృతి, దిశ, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రివెన్షన్ యూనిట్ల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



అనంతపురంలో పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ
అన్న క్యాంటీన్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ ఎం. జశ్వంత్ రావు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే దిశగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జశ్వంత్ రావు క్షేత్రస

పొదిలి మునిసిపాలిటీ ఎన్నికల ఏర్పాట్లను

పరిశీలించిన జిల్లా కలెక్టర్



పొదిలి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : మార్కాపురం జిల్లా పొదిలి మునిసిపాలిటీ ఎన్నికలు--2026 సన్నాహాల్లో భాగంగా జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత పొదిలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను సంబంధిత అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు 24 గంటల పాటు నిరంతర పోలీస్ పహారా ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల సీలింగ్ ప్రక్రియలోనూ ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల సౌకర్యార్థం తాగునీరు, నీడ కోసం టెంట్లు, తగినంత లైటింగ్‌తో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశలోనూ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాడికిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహణ



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 13) : యాడికి బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవర ణలోని బ్యాడ్మింటన్ కోర్టులో సీనియర్స్ విభాగం టోర్నమెంట్ నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలుగా వేణు--నాగార్జున,రన్నర్స్‌గా కుమార్-- శరత్ నిలిచారని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. విజేతలకు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.5 వేలు ప్రైజ్‌మనీని చార్టర్డ్ అకౌంటెంట్ బొరుగుల విజయకు మార్ అందజేశారని తెలిపారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థు ల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా శని,ఆదివారాల్లో జూనియర్స్ విభాగం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యాడికిలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం





యాడికి నవంబర్ 13 (తెలుగుకలం) : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాడికి మండల కేంద్రంలోని ఐదో సచివాలయం పరిధిలో శుక్రవారం ఆసుపత్రి వైద్యులు పరమేశ్వర్, సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే నిర్వహించడంతోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తా చెదారాన్ని తొలగిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఎంపీహెచ్ఏఎఫ్ స్వర్ణలత, మేల్ హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి,ఆశా కార్యకర్తలు సుజాత, మహబూ బీ పాల్గొన్నారు.

బద్వేలు ఆర్టీసీ బస్టాండ్‌లో చిన్నారి అపహరణ యత్నం..

దుండగుడికి దేహశుద్ధి చేసిన ప్రయాణికులు



బద్వేలు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఒక చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు దుండగుడు ప్రయత్నించిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణం నిమిత్తం బస్టాండ్‌కు వచ్చిన చిన్నారిపై కన్నేసిన ఓ అగంతకుడు, బంధువుల దృష్టి మళ్లిన సమయం చూసి ఆ పాపను అక్కడి నుంచి అపహరించేందుకు యత్నించాడు. అయితే చిన్నారి కనిపించకపోవడం లేదా దుండగుడు పాపను తీసుకెళ్తుండటాన్ని గమనించిన బంధువులు వెంటనే అప్రమత్తమై కేకలు వేశారు. వారి అరుపులు విన్న బస్టాండ్‌లోని తోటి ప్రయాణికులు, స్థానికులు తక్షణమే స్పందించి సదరు దుండగుడిని వెంబడించి పట్టుకున్నారు. చిన్నారిని సురక్షితంగా తల్లిదండ్రులు, బంధువుల చెంతకు చేర్చిన అనంతరం ఆగ్రహంతో ఊగిపోయిన బాధిత కుటుంబ సభ్యులు, ప్రయాణికులు కలిసి ఆ దుండగుడికి తగిన రీతిలో దేహశుద్ధి చేశారు. రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంగణంలో పట్టపగలే ఇటువంటి ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రయాణికుల చేతిలో దెబ్బలు తిన్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి వివరాలు మరియు అపహరణ యత్నం వెనుక ఉన్న కారణాలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుంతకల్ పురపాలక సంఘం పరిధిలోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషాతో కలిసి క్యాంటీన్‌ను సందర్శించిన ఆమె, అక్కడి నిర్వహణ తీరును, భోజన వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా కమిషనర్ క్యాంటీన్ లోపలి భాగం, వంటగది, భోజనం వడ్డించే ప్రదేశం మరియు పరిసరాలను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌కు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని సమయానికి అందించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తాగునీటి వసతి మరియు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషా, మున్సిపల్ సిబ్బంది మరియు అన్న క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఎలక్ట్రికల్ ఆటో విరాళం



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన గౌను కృష్ణయ్య సతీమణి శ్రీమతి సంగీత ఆలయ అవసరాల నిమిత్తం నూతన మహీంద్రా ఎలక్ట్రికల్ ఆటోను స్వామి వారికి కానుకగా సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) మేడిపల్లి విజయరాజు సమక్షంలో దాతలు నూతన వాహన పత్రాలను అధికారికంగా అప్పగించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య నూతన ఎలక్ట్రికల్ ఆటోకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో విజయరాజు దాతలైన గౌను కృష్ణయ్య దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామి వారి శేషవస్త్రం మరియు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు ఇలా ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం వద్దు

ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ యశోద

ఎల్ నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గినందున ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : గుంతకల్లు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామగోని యశోద గౌడ్ అధికారులను ఆదేశించారు. శు క్రవారం ఆమె మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు నీటి సరఫరా విభాగ అధికారులతో కలిసి పట్టణ శివారులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్యాంకులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, నీటి మట్టం, పంపింగ్ వ్యవస్థ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా చైర్‌పర్సన్ యశోద మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని రిజర్వాయర్లలో తాగునీటి లభ్యత గణనీయంగా తగ్గిందని తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ మరియు ముందస్తు చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ట్యాంకులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూనే, పట్టణంలోని అన్ని వార్డులకు సమానంగా, నిర్ణీత సమయానికి తాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పట్టణంలోని ఎత్తైన ప్రాంతాలు మరియు శివారు కాలనీలలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా పైపులైన్ల లీకేజీలు ఉంటే తక్షణమే మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా అరికట్టాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల దాహార్తిని తీర్చడంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని, తాగునీటి సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి ఆలయంలో ఘనంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : పవిత్ర కార్తీకమాస శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కార్తీకమాస విశిష్టతను పురస్కరించుకుని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి సామూహిక కుంకుమార్చనలలో పాల్గొన్నారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణమంతా భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో దేదీప్యమానంగా ప్రకాశించింది. భక్తుల గోవింద, అమ్మవారి నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ?ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ, శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో శక్తి స్వరూపిణి అయిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం నాడు భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ఎంతో విశేషమని తెలిపారు. కార్తీక శుక్రవారం రోజున అమ్మవారికి కుంకుమార్చనలు, దీపోత్సవ పూజలు నిర్వహించడం వల్ల భక్తులకు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, కుటుంబంలో సుఖశాంతులు, ఐదోతనం, సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని ఆయన వివరించారు. అనంతరం దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు

నేటి బాలలే రేపటి చరిత్ర నిర్మాతలు

మున్సిపల్ చైర్‌పర్సన్ యశోద గౌడ్



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 13) : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజాన్ని లోతుగా అర్థం చేసుకునే జ్ఞానాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ యశోద గౌడ్ పిలుపునిచ్చారు. శు క్రవారం గుంతకల్లు పట్టణంలోని డాక్టర్ సరోజినీ నాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు, చరిత్ర నిర్మాణానికి పునాదులని యశోద గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చిన్నప్పటి నుంచే సృజనాత్మకతను, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ, వారిలోని ప్రతిభను వెలికితీయాలని కోరారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

రాప్తాడు ఘటన బాధిత బాలిక

గోపిక కుటుంబానికి వైసీపీ రూ.5 లక్షల ఆర్థిక సాయం



బెంగళూరు / అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఓ ఉన్మాది జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి, బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థిని గోపిక కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ శుక్రవారం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి గోపికను పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపిక ఆరోగ్య పరిస్థితిపై వారు ప్రత్యేక వైద్య నిపుణులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోపిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ తరపున ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ, ఇటీవల వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా బెంగళూరు ఆసుపత్రికి వచ్చి గోపికను పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ హామీ మేరకే ఇప్పుడు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. గోపిక పూర్తిగా కోలుకునే వరకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబానికి అండగా ఉంటాయని, ఎలాంటి అవసరం వచ్చినా పార్టీ ఆదుకుంటుందని వారు భరోసా ఇచ్చారు. కాగా, ఇదే దాడి ఘటనలో గోపికను కాపాడే ప్రయత్నంలో గాయపడిన మరో విద్యార్థిని లక్ష్మి కుటుంబానికి కూడా వైసీపీ తరపున రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసిన విషయం తెలిసిందే.

పామిడి: వరి కోత మిషన్కు విద్యుత్ తీగ తగిలి డ్రైవర్ దుర్మరణం

గంజిగుంటపల్లిలో విషాద ఛాయలు



పామిడి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : అనంతపురం జిల్లా పామిడి మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని పోతరాయి గ్రామంలో జరిగిన ప్రమాదంలో వరి కోత మిషన్ డ్రైవర్ విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయారు. ఈ అకస్మిక ఘటనతో మృతుని కుటుంబంలో తీవ్ర రోదనలు మిన్నంటగా, స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు మరియు పోలీసుల వివరాల ప్రకారం.. పామిడి మండలం గంజిగుంటపల్లికి చెందిన బోయ రమేశ్ వరి కోత మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పోతరాయి గ్రామంలో వరి కోత పనుల నిమిత్తం మిషన్‌తో వెళ్లారు. పనిలో భాగంగా పొలంలో మిషన్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు మిషన్‌కు తగిలాయి. ఈ ఘటనలో తీవ్ర విద్యుత్ ప్రసారం కావడంతో బోయ రమేశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కుటుంబానికి పెద్ద దిక్కైన రమేశ్ ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో ఆయన భార్య, ఇద్దరు పిల్లలు గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడి స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కుటుంబపోషణ భారంగా మారిన తరుణంలో యజమానిని కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. యువకుడు ఆకస్మిక మృతి చెందడంతో గంజిగుంటపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

అనారోగ్యంతో వైసీపీ కార్యకర్త ఆత్మహత్య

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేతిరెడ్డి



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ఎల్సీకే పురం ప్రాంతానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మహేష్ (33) ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం, మహేష్ తన నివాసంలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో వెంటనే అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే, మహేష్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధృవీకరించారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో, ఆ మనస్తాపంతోనే మహేష్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు మరియు స్థానికులు తెలిపారు. చేతికందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ధర్మవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. మహేష్ భౌతికకాయానికి నివాళులర్పించిన ఆయన, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్త మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రశాంత వాతావరణంలో సర్పంచ్ ఎన్నికలు

జరిగేలా ప్రజల సహకారం కోరిన సీఐ ధరణి కిషోర్



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : రాబోయే గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గుత్తి మండలంలో పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామంలో గుత్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ధరణి కిషోర్ మరియు ఎస్సై సురేష్ కుమార్ సిబ్బందితో కలిసి గ్రామ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేసి ప్రజలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 29వ తేదీన జరగనున్న గ్రామ సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అందరి భాగస్వామ్యం ఎంతో కీలకమని వారు స్పష్టం చేశారు. ఈ గ్రామసభలో ఎన్నికల నిబంధనలతో పాటు సమాజంలో పౌరులు పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందేందుకు 'డైల్ 100' ప్రాముఖ్యతను గ్రామస్తులకు తెలియజేశారు. అలాగే, మహిళలు మరియు చిన్నారుల రక్షణార్థం అమల్లో ఉన్న పోక్సో చట్టం గురించి, అలాగే బలహీన వర్గాల రక్షణ కోసం రూపొందించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం యొక్క విశేషాలను ప్రజలకు వివరించి చైతన్యపరిచారు.

తిరుపతి జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

లారీ డ్రైవర్‌కు 10 రోజుల జైలు శిక్ష, జరిమానా



రేణిగుంట (తెలుగు కలం) (నవంబర్ 13) : ప్రతినిధి : మద్యం సేవించి లారీ నడిపిన కేసులో ఓ డ్రైవర్‌కు తిరుపతిలోని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 10 రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన లారీ డ్రైవర్ జి. వెంకటరెడ్డి (65) మద్యం మత్తులో లారీ నడుపుతూ పట్టుబడ్డారు. విచారణలో భాగంగా ఆయన తన నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం ఈ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా రేణిగుంట అర్బన్ సీఐ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు అందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తోటి ప్రయాణికుల మరియు తమ ప్రాణ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శనివారం 14 - 11 - 2026

ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. తొలి రోజే రూ.1,57,607 కోట్ల పెట్టుబడులు..!



విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సులో ఏపీకి పెట్టుబడులు వెల్లువ కొనసాగుతున్నాయి. సదస్సు తొలిరోజే రాష్ట్రానికి భారీ పెట్టుబడుల ప్రకటనలు వచ్చాయి. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో పారిశ్రామికవేత్తలు ఏపీ ప్రభుత్వంతో భారీగా అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. మొత్తం రూ.1,57,607 కోట్ల విలువైన 35 ఒప్పందాలు జరిగాయని అధికారులు ప్రకటించారు. వీటి ద్వారా రాష్ట్రంలో 52,956 మందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 30 ఎంఓయూలు, 5 జీఓల ద్వారా ఈ పెట్టుబడులు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కనుంది. ఈ సదస్సులో రెన్యువబుల్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్, హెల్త్‌కేర్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ముందుకు వచ్చాయి. మెగా ఇంజనీరింగ్ సంస్థ మూడు ఎంఓయూల ద్వారా ఏకంగా రూ.39,400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ సంస్థ పెట్టుబడులతో 12,940 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. రష్మీ మెటలర్జికల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.18,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. క్లీన్ మ్యాక్స్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.41 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. యునైటెడ్ టెలికం లిమిటెడ్ సైతం రూ.9,053 కోట్ల పెట్టుబడికి ఒకే చెప్పింది. ఏపీలో లక్షలాది ఉద్యోగాల జాతర.. కియా, గూగుల్, ఎల్జీ, కాగ్నిజెంట్ భారీ పెట్టుబడులు.. రెన్యూ ఫోటోవోల్టాయిక్స్ - రూ.8,500 కోట్లు పెట్టుబడికి ముందుకొచ్చింది. దీంతో 800 ఉద్యోగాలు రానున్నాయి. రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ రూ.42 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. దీంతో 1,500 ఉద్యోగాలు రానున్నాయి. చీఎూచీ మాగ్నెటెక్ - 3,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. దీంతో 1,000 ఉద్యోగాలు రానున్నాయి. సెలాక్స్ గ్రీన్‌మెట్ రూ.1,800 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. ఈ పెట్టుబడితో 1,000 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. వెల్సపన్ గ్రూప్ రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. దీంతో 3,500 మందికి ఉపాధి లభించనుంది. ఎవర్‌వోల్ట్ సోలార్ టెక్నాలజీ రూ.2,350 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. దీంతో 1,200 ఉద్యోగాలు రానున్నాయి. హీరో మోటర్ కార్ప్ రూ.1,457 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. దీంతో 1,000 ఉద్యోగాలు రానున్నాయి. తొలిరోజే ఈ స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు కుదరడంతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తాయని అధికారులు చెబుతున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

మరోసారి సిగరెట్ల ధరలను పెంచిన ఐటీసీ.. !

ఐటీసీ తన సిగరెట్ల ధరను మరోసారి పెంచింది. తన గోల్డ్ ఫ్లేక్ రెగ్యులర్ సైజ్ ఫిల్టర్ టిప్స్'- 69 మిమీ) సిగరెట్ ప్యాక్ ధరను రూ.125 నుంచి రూ.135కి పెంచింది. అంటే ఒక ప్యాక్ పై రూ.10 పెంచింది. 2026 సంవత్సరంలో ఈ బ్రాండ్‌కు సంబంధించి ధర పెరగడం ఇది రెండోసారి. అంతకుముందు ఫిబ్రవరిలో ధరను రూ.95 నుంచి రూ.125కి పెంచింది. ఒక్కో ప్యాకెట్ పై రూ.30 మేర పెంచిన విషయం తెలిసిందే. ఐటీసీ సిగరెట్ వ్యాపారంలో 'గోల్డ్ ఫ్లేక్ ఒక కీలకమైన ప్రొడక్ట్ గా ఉంది. ఇది కంపెనీ మొత్తం సిగరెట్ విక్రయాలలో దాదాపు 30-35% వాటాను కలిగి ఉంది. లాభాలకు ఈ బ్రాండ్ ఇచ్చే సహకారం ఇంకా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు, కాబట్టి ఈ విభాగంలో ధరల నిర్ణయాలు ఐటీసీ మొత్తం సిగరెట్ వ్యాపారానికి చాలా ముఖ్యమైనవి. అందువల్ల ధరలను నిర్ణయించేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ధరలను పెంచడం ద్వారా పన్నుల భారాన్ని కొంతవరకు అధిగమించవచ్చు. కానీ ధరలను మరీ ఎక్కువగా పెంచితే, వినియోగదారులు అక్రమ (చట్టవిరుద్ధమైన) ప్రత్యామ్నాయాల వైపు మళ్లే ప్రమాదం ఉంది. ఐటీసీ విక్రయాలలో లాభదాయకతలో 'గోల్డ్ ఫ్లేక్' కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ విభాగంలో భవిష్యత్తులో తీసుకునే ధరల నిర్ణయాలపై అందరి దృష్టి ఉంటుంది. ప్రస్తుతం ఐటీసీ తన ఆర్థిక పనితీరు విషయంలో కొంత ఒత్తిడిని ఎదుర్కొంటోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 20.1 శాతం తగ్గి రూ.5,180 కోట్ల నుంచి రూ.4,137.12 కోట్లకు పడిపోయింది. స్టాక్ మార్కెట్ క్లోజింగ్ బెల్.. నష్టాల నుంచి బయటపడిన షేర్ మార్కెట్.. అయినా ఇన్వెస్టర్ల గుండెల్లో దడ.. దీనికి ప్రధాన కారణం సిగరెట్ వ్యాపారంపై పన్నులు ఊహించని స్థాయిలో పెరగడమే. గత బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై భారీగా పన్నులు పెంచింది. దీంతో కంపెనీ మార్జిన్లపై ప్రభావం పడింది. పెంచిన పన్ను భారాన్ని వినియోగదారులపై మోపాలని భావించింది. అందుకే రెండుసార్లు సిగరెట్ల ధరలను పెంచింది. అయినప్పటికీ సిగరెట్ బిజినెస్ ఆశించిన స్థాయిలో రాణించ లేదు. రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 1.8% పెరిగి రూ.18,081 కోట్ల నుంచి రూ.18,401 కోట్లకు చేరుకుంది. సిగరెటేతర వ్యాపారాలు కొంత ఊరటనిచ్చాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసిజి (- ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) విభాగం గత 14 త్రైమాసికంలో అత్యధిక ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. సిగరెట్ల ధరలు పెంచడం వల్ల వచ్చే త్రైమాసికంలో ఐటీసీ సిగరెటు బిజినెస్ లో గ్రోత్ ఉండే అవకాశం ఉంది. ఒక వేళ వచ్చే బడ్జెట్



లో పొగాకు ఉత్పత్తులపై పన్ను తగ్గిస్తే లాభాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే కేంద్రం పొగాకు ఉత్పత్తులపై పన్ను పెంచే అవకాశం లేదు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ ఐపీఓ.. రూ.10 వేల కోట్లు సేకరించే అవకాశం..!

స్నాక్స్ మార్కెట్లో దూసుకెళ్తున్న హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ తన ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించింది. కంప్లయన్స్ మేనేజ్‌మెంట్, క్రాస్-ఫంక్షన్ కోఆర్డినేషన్ కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఆఫీస్ బాధ్యతలను జ్యూకి అప్పగించింది. సాంప్రదాయ భారతీయ స్వీట్లు, నమ్‌కీన్‌ల తయారీదారు అయిన ఈ సంస్థ రూ.1 లక్ష కోట్లకు పైగా వాల్యుయేషన్‌తో దాదాపు రూ.10,000 కోట్ల (దాదాపు 1 బిలియన్) ఇష్యూ పరిమాణంతో 2027 చివరిలో పబ్లిక్ లిస్టింగ్‌కు సిద్ధమవుతోందని తెలుస్తోంది. ప్రతిపాదిత లో ప్రస్తుత వాటాదారుల ఆఫర్ ఫర్ సేల్, షేర్ల ఫ్రెష్ ఇష్యూ ఉంటాయని తెలిసింది. భారతదేశ వినియోగదారుల రంగంలో వచ్చే ఏడాది మరో భారీ లిస్టింగ్ జరగనుంది. కోకా-కోలా ఇండియా తన బాట్లింగ్ వ్యాపారమైన హిందుస్థాన్ కోకా-కోలా హోల్డింగ్స్‌ను 1 బిలియన్ డాలర్ల విలువతో లిస్టింగ్ చేయడానికి యోచిస్తోంది. ఈ పానీయాల తయారీ సంస్థ గత వారం సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వద్ద తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఢిల్లీకి చెందిన హల్దీరామ్ స్నాక్స్, నాగ్‌పూర్‌కు చెందిన హల్దీరామ్ ఫుడ్స్ ఇంటర్నేషనల్ విలీనం తర్వాత హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ ఏర్పడింది. రైతులకు గుడ్ న్యూస్.. త్వరలో రైతు భరోసా..! ఈ కంపెనీలోని ప్రపంచ స్థాయి ప్రముఖ పెట్టుబడిదారులలో టెమాసెక్, ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ, ఆల్ఫా వేవ్ గ్లోబల్, ఎల్ క్యాటెర్టన్ ఉన్నాయి. అమెరికాకు చెందిన పెట్టుబడిదారు ఎల్ క్యాటెర్టన్ డిసెంబర్ 2025లో పెట్టుబడి పెట్టగా, సింగపూర్‌కు చెందిన



టెమాసెక్, ఆల్ఫా వేవ్ గ్లోబల్, యూఏఈకి చెందిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీలు మార్చి-ఏప్రిల్ 2025 మధ్య వాటాలను కొనుగోలు చేశాయి. గత సంవత్సరం మార్చి-ఏప్రిల్‌లో జరిగిన పెట్టుబడి, భారతదేశంలోని వినియోగదారుల రంగంలో అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ ఒప్పందంగా నిలిచింది. ఈ స్నాక్స్ తయారీ సంస్థ విలువ 10 బిలియన్ డాలర్లుగా (రూ.85,000 కోట్లు) అంచనా వేశారు. ముగ్గురు అంతర్జాతీయ పెట్టుబడిదారులు కలిసి హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో దాదాపు 15% వాటాను కొనుగోలు చేయగా, ఆ సమయంలో వ్యవస్థాపక-ప్రమోటర్ అగర్వాల్ కుటుంబం 85 శాతం వాటాను కలిగి ఉంది. డిసెంబర్ కొనుగోలు తర్వాత కంపెనీలో ఎల్ క్యాటెర్టన్ వాటా ఎంత ఉందో నిర్ధారించలేకపోయారు. క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రకారం, హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ 2026 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రూ.7,762 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. దీని ఆపరేటింగ్ మార్జిన్ దాదాపు 19 శాతంగా ఉంది. వ్యాపార ఏకీకరణకు సంబంధించిన ప్రారంభ నిర్వహణ సవాళ్లు, యూఎస్ సుంకాల ప్రభావంతో ఎగుమతులు తగ్గడం వంటి వాటి మధ్య, 2026 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 9-10% మేర పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ నివేదిక పేర్కొంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఏపీలో లక్షలాది ఉద్యోగాల జాతర.. కియా, గూగుల్, ఎల్జీ, కాగ్నిజెంట్ భారీ పెట్టుబడులు..

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, సాంకేతిక ముఖచిత్రం వేగంగా మారుతోంది. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 వేదికగా అంతర్జాతీయ టెక్, ఆటోమొబైల్ దిగ్గజాలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ముందుకు రావడంతో యువతకు వేలాది కొత్త ఉద్యోగ అవకాశాల ద్వారాలు తెరుచుకున్నాయి. గూగుల్, కాగ్నిజెంట్, ఎల్‌జి, కియా వంటి దిగ్గజ సంస్థల విస్తరణ ప్రణాళికలు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలుపుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, హెచ్‌ఆర్‌డి శాఖల మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోకి వస్తున్న ప్రతిష్ఠాత్మక పెట్టుబడుల వివరాలను వెల్లడించారు. ముఖ్యంగా గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టు.. భారతదేశంలోని డేటా సెంటర్ రంగంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా నిలవనుందని ఆయన తెలిపారు. అలాగే ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ తన నూతన ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా రాష్ట్రంలో ఏకంగా 25,000 కొత్త ఉద్యోగాలను సృష్టించనుండగా.. ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జి రూ. 5,000 కోట్ల పెట్టుబడితో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. దీనికి తోడు, విశాఖపట్నాన్ని ఏఐ మరియు డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మరోవైపు ఆటోమొబైల్ రంగంలోనూ రాష్ట్రానికి భారీ ఊతం లభించింది. దక్షిణ కొరియా వాహన తయారీ దిగ్గజం కియా ఆంధ్రప్రదేశ్‌లో రెండవ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అదనంగా 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగ్గు లీ సదస్సులో ప్రకటించారు. ఈ విస్తరణ ద్వారా సుమారు 12,000 కొత్త ఉద్యోగాలు లభించడంతో పాటు, సంస్థ వార్షిక వాహన ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 4.30 లక్షల నుండి 6 లక్షల యూనిట్లకు పైగా చేరుకోనుంది. ఇది అనంతపురం ప్రాంతంలో ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమల వృద్ధికి మరింత బలాన్ని చేకూర్చనుంది. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు ప్రకటన.. 388 మండలాలు విలవిల..సీమలోనే ఎక్కువ.. ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు దేశ విమానయాన రంగ భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ప్రపంచ సరఫరా గొలుసులు మారుతున్న తరుణంలో అభివృద్ధిని ఎన్డీఏ ప్రభుత్వం తన ప్రధాన అజెండాగా మార్చుకుందని అన్నారు. నూతన 'ఉడాన్' కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలు, 200



హెలిపోర్టులను నిర్మించి ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుండటం రాష్ట్ర ఎగుమతులు, పర్యాటక రంగాలకు గేమ్ ఛేంజర్‌గా మారనుందని పేర్కొన్నారు. అలాగే, గ్లోబల్ సౌత్ దేశాలతో వాయు అనుసంధానాన్ని పెంచడంతో పాటు, ఔషధాలు, త్వరగా పాడైపోయే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల కోసం వాయు సరుకు రవాణా నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు నాయుడు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా.. రాబోయే రెండేళ్లలో భారతదేశం సొంతంగా పౌర విమానయాన విమానాలను అభివృద్ధి చేసే దిశగా కీలక అడుగులు వేస్తున్నామని ఆయన ప్రకటించారు. మొత్తంగా, భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనతో ఆంధ్రప్రదేశ్ నూతన ఆర్థిక శకానికి నాంది పలుకుతోంది.

ఐదేళ్లలో 514 శాతం రాబడి ఇచ్చిన మల్టీబ్యాగర్ స్టాక్ ఇదే..!



కెమికల్ రంగంలోని మల్టీబ్యాగర్ స్టాక్ టీజీవీ ఎస్ఆర్ఏఏసీ 2026 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికానికి గాను బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో గురువారం నాటి ట్రేడింగ్‌లో 7.71%కి పైగా లాభపడింది. బుధవారం రూ.120.65 వద్ద ముగిసిన ఈ షేరు గురువారం బీఎస్ఈలో రూ.125.50 వద్ద ప్రారంభమై, నవంబర్ 12న ఇంట్రాడే గరిష్ట ధర రూ.137.80ని తాకింది. 2027 ఆర్థిక సంవత్సరం (27) రెండో త్రైమాసికంలో టీజీవీ ఎస్ఆర్ఏఏసీ అద్భుతమైన పనితీరును కనబరిచింది. కంపెనీ నికర లాభం గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలోని రూ.37.05 కోట్ల నుంచి 50.4% వృద్ధితో రూ.55.72 కోట్లకు చేరుకుంది. కంపెనీ పన్నుకు ముందు లాభం 26 రెండో త్రైమాసికంలోని రూ.49.89 కోట్ల నుంచి 27 రెండో త్రైమాసికంలో రూ.76.84 కోట్లకు పెరిగింది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 18.1 శాతం వృద్ధితో 27 రెండో త్రైమాసికంలో రూ.590.47 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం కూడా 26 రెండో త్రైమాసికంలోని రూ.503.18 కోట్ల నుంచి రూ.596.57 కోట్లకు పెరిగింది, ఇది కంపెనీ మొత్తం నిర్వహణ పనితీరులో వృద్ధిని సూచిస్తోంది. నిర్వహణ పరంగా చూస్తే సెప్టెంబర్ త్రైమాసికానికి టీజీవీ ఎస్ఆర్ఏఏసీ ఎబిట్డా రూ.111 కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 19.4% పెరుగుదల. దీని ఎబిట్డా మార్జిన్ 18.78 శాతంగా ఉంది. ఇది ఆదాయంతో పాటు నిర్వహణ ఆదాయాలు కూడా మెరుగుపడ్డాయి. ూశ్రీంశీ =ష్ణఎ నాడు ఏఐని శాసించిన దిగ్గజం నేడు దీన స్థితిలో.. రూ. లక్షల కోట్ల నష్టాలతో భోరుమంటున్న ఇన్వెస్టర్లు.. మొత్తంమీద 27 రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం, నిర్వహణ ఆదాయాలు, లాభదాయకతలో వృద్ధిని నమోదు చేసింది. ఆదాయ వృద్ధితో పోలిస్తే నికర లాభంలో మరింత గణనీయమైన పెరుగుదల కనిపించింది. టీజీవీ ఎస్ఆర్ఏఏసీ షేర్లు గత వారం రోజుల్లో 10.45 శాతం పెరిగాయి. గత రెండు వారాల్లో 15 రాబడి ఇచ్చాయి. అయితే గత నెలలో ఈ షేరు సాధించిన లాభాలు 5.70 శాతానికి పరిమితమయ్యాయి. ఇది ఇటీవల నమోదైన భారీ పెరుగుదల తర్వాత కొంత స్థిరీకరణ దశలో ఉన్నట్లు కనిపిస్తోంది. గత మూడు మరియు ఆరు నెలల కాలంలో టీజీవీ ఎస్ఆర్ఏఏసీ షేర్లు 23 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ షేరు 18 శాతం రాబడిని అందించింది. ఇది 2026లో ఇప్పటివరకు సానుకూల పనితీరును కనబరుస్తోంది. దీర్ఘకాలిక పనితీరును పరిశీలిస్తే గత ఏడాది కాలంలో టీజీవీ ఎస్ఆర్ఏఏసీ షేర్లు 13.32 శాతం, రెండేళ్ల కాలంలో 18 శాతం లాభపడ్డాయి. మరింత సుదీర్ఘ కాలంలో అంటే మూడేళ్లలో ఈ షేరు 24 శాతం వృద్ధిని సాధించింది. గత దశాబ్ద కాలంలో టీజీవీ ఎస్ఆర్ఏఏసీ షేర్లు అద్భుతమైన రాబడులను అందించాయి. ఐదేళ్లలో 147 శాతం, పదేళ్లలో 514 శాతం మేర రాబడి అందించాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

చిరు వ్యాపారులకు గుడ్ న్యూస్.. మరో ఐదేళ్ల పాటు ముద్ర రుణాలు..!



ప్రధానమంత్రి ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్ల కోసం ఉద్దేశించిన రుణ హామీ నిధిని 31 మార్చి 2031 వరకు ఐదేళ్ల కాలానికి కొనసాగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీఎం ముద్రా పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రుణ సంస్థలు 43.34 లక్షల కోట్ల రూపాయల విలువైన 60.36 కోట్లకు పైగా రుణాలను మంజూరు అయ్యాయి. ఐదు వేల కోట్ల రూపాయల కేటాయింపునకు ఆమోదం లభించిందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇది 12.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ముద్రా రుణాలకు మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్టాండ్-అప్ ఇండియా పథకాన్ని 31 మార్చి 2031 వరకు ఐదేళ్ల కాలానికి కొనసాగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారిలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, ఐదేళ్ల వ్యవధిలో అదనంగా 2.5 లక్షల మంది పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం లక్ష్యం. ఏప్రిల్ 2016లో ప్రారంభమైనప్పటి నుంచి ఈ పథకం 2.75 లక్షలకు పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రుణాలను అందించింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఈ పథకం పది లక్షల నుంచి కోటి రూపాయల వరకు రుణాలకు హామీ ఇస్తుందని వైష్ణవ్ పేర్కొన్నారు. రైతులకు గుడ్ న్యూస్.. త్వరలో రైతు భరోసా..! రుణ హామీ కోసం నాలుగు వేల 111 కోట్ల రూపాయల నిధితో ఈ పథకం కాలపరిమితి నాలుగు సంవత్సరాలు ఉంటుందని ఆయన చెప్పారు. నోయిడా మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా దాదాపు 8.5 కిలోమీటర్ల మేర విస్తరించి, ఐదు ఎలివేటెడ్ స్టేషన్లను కలిగి ఉన్న ఆక్వా లైన్ మెట్రో రైల్ కారిడార్‌ను నోయిడా సెక్టార్-51 నుంచి గ్రేటర్ నోయిడా సెక్టార్-04 వరకు పొడిగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కారిడార్ కార్యరూపం దాల్చిన తర్వాత, నోయిడా, గ్రేటర్ నోయిడాలో సుమారు 72 కిలోమీటర్ల క్రియాశీల మెట్రో రైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది. కాగా ముద్ర యోజన కింద రాబోయే ఐదేళ్లల్లో రూ.1.26 లక్షల కోట్ల ముద్రా విలువైన రుణాలను మంజూరు చేసే అవకాశం ఉంది. చిన్న వ్యాపారుకుల దీని వల్ల లబ్ధి పొందనున్నారు. వారికి రుణాలు సులువుగా అందించేందుకు ఇది ఉపయోగపడనుంది. కేంద్రం రూ.5 వేల కోట్ల నిధి ఏర్పాటు చేయడం ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నష్టం భయం తగ్గుతుంది. దీని వల్ల రుణాలు వేగంగా మంజూరు అయ్యే అవకాశం ఉంటుంది. ముద్ర యోజనలో కేటరిగిలు ఉంటాయి. శిశు, కిశోర్, తరుణ్ కేటగిరీలుగా విభజించారు. శిశు కేటగిరీ కింద రూ.50 వేల వరకు, కిశోర్ కేటగిరీ కింద రూ.5 లక్షల వరకు, తరుణ్ కేటగిరీ కింద రూ.10 లక్షల వరకు రుణం ఇస్తారు. కిరాణా దుకాణాలు, చిన్న తయారీ యూనిట్లు, సేవా రంగం, చేతివృత్తులవారు, వీధి వ్యాపారులు వంటి చిన్న వ్యాపారులకు రుణాలు తీసుకోవచ్చు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం

'ఇడుపు కాయితం' టీజర్ వచ్చేసింది.. డిసెంబర్ 11న గ్రాండ్‌గా రిలీజ్!



టాలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఆసక్తికరంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం 'ఇడుపు కాయితం'. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే టాలెంటెడ్ హీరో ప్రియదర్శి పులికొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. తెలంగాణ మట్టి వాసన ఉట్టిపడేలా, పల్లెటూరి సంప్రదాయాలు మరియు కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ప్రియదర్శి సరసన నాగదుర్గ కథానాయికగా నటిస్తూ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్నారు. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్, బన్నీ వాస్, తపితా సుకుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సురేష్ బొప్పిలి అందిస్తున్న సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన 'శ్రీలత', 'గడప', 'బరాత్ బీట్' పాటలు శ్రోతలను విపరీతంగా అలరించగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను క్రియేట్ చేసింది. అన్ని బాధ్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ చిత్ర టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.

అల్లరి నరేశ్ ఆల్కహాల్.. వచ్చేది అప్పుడే

హీరో అల్లరి నరేశ్ నటించిన తాజా చిత్రం 'ఆల్కహాల్'. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో గుర్తింపు పొందిన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 18 న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.సినిమాలు చూడండి కాగా అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటించగా, రుహానీ శర్మ, నిహారిక ఎన్ఎం కీలక పాత్రలు పోషించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. అయితే ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. దర్శకుడు మెహర్ తేజ్ మంచి కామెడీ టైమింగ్ పంచ్‌లతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది.



'టాక్సిక్' రిజల్ట్ నన్ను కుంగదీసింది : కియారా అద్వానీ

బాలీవుడ్ ప్రముఖ నటి కియారా అద్వానీ ఇటీవల నటించిన 'టాక్సిక్' సినిమా విడుదల సమయంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, భావోద్వేగాల గురించి తాజాగా ఓపెన్ అయ్యారు. సినిమా మొదటి రోజు వచ్చిన భారీ ఓపెనింగ్ కలెక్షన్లను చూసి అంతా సంతోషించినప్పటికీ, ఆ తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడం తన బృందానికి ఎంతో బాధ కలిగించిందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆ తొలి వారాంతంలో ఈ పరాజయం తనను ఎంతగానో కుంగదీసిందని, ఆ క్షణాలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని కియారా పేర్కొన్నారు. అయితే, తన సాధారణ కంఫర్ట్ జోన్‌ను పూర్తిగా పక్కన పెట్టి, కెరీర్‌లోనే ఎంతో సవాల్‌తో కూడిన ఒక విభిన్నమైన పాత్రను పోషించానని, ఆ పాత్రకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కడం తనకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పారు. ఈ సందర్భంలో పెళ్లి తర్వాత సినిమాలలో రొమాంటిక్ సన్నివేశాలలో నటించడంపై వస్తున్న ట్రోల్స్, విమర్శల గురించి కూడా ఆమె స్పందించారు. తన భర్త, ప్రముఖ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఈ విషయంలో ఎంతో మెచ్యూరిడ్‌గా వ్యవహరించారని కియారా కొనియాడారు. పెళ్లి తర్వాత రొమాంటిక్ సీన్లలో నటించడంపై సిద్ధార్థ్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోగా, ఆ విషయాన్ని అసలు పట్టించుకోలేదని, ఎప్పుడూ తనతో ఆ గురించి ప్రస్తావించనేలేదని ఆమె వెల్లడించారు. తమ వివాహం తర్వాత ఈ అంశంపై ఇద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదని, ఆయనకు దీనిపై ఎలాంటి నెగెటివ్ అభిప్రాయం లేదని స్పష్టం చేశారు.





కోలీవుడ్‌లో సూర్య సరికొత్త చరిత్ర.. మూడు సినిమాలతో రూ.800 కోట్ల మైలురాయి!

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరో సూర్య, ప్రస్తుతం బాక్సాఫీస్ పద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపిస్తున్నారు. 2026వ సంవత్సరం సూర్య కెరీర్‌లోనే అత్యంత అద్భుతమైన సంవత్సరంగా నిలుస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే పరుస విజయాలతో దూసుకుపోతున్న ఆయన, బాక్సాఫీస్ పద్ద రికార్డుల మోత మోగిస్తున్నారు. కేవలం మూడు సినిమాలతోనే కోలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ ఏకంగా రూ.800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రస్తుతం సూర్య నటించి, బాక్సాఫీస్ పద్ద భారీ విజయంతో దూసుకుపోతున్న (సీన్) సినిమా కలెక్షన్ల పరంగా అదరగొడుతోంది. విడుదలైన ప్రతీ చోటా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన తెచ్చుకుంటున్న ఈ చిత్రం, బాక్సాఫీస్ పద్ద తన జోరును ఇంకా కొనసాగిస్తూ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సినిమా త్వరలోనే రూ.300 కోట్ల మార్కును చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఈ చిత్రం ఈ అద్భుతమైన మైలురాయిని అందుకుంటే, సూర్య ఖాతాలోని మొత్తం వసూళ్లు ఏకంగా రూ.900 కోట్లకు చేరుకుంటాయి. ఇది కోలీవుడ్ ఇండస్ట్రీలో ఒక సరికొత్త సంచలనమనే చెప్పాలి. అంతేకాదు, ఈ ఏడాది సూర్య సాధించిన మరో అరుదైన ఘనత కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒకే కేలండర్ ఏడాదిలో పరుసగా మూడు రూ.200 కోట్ల పైచిలుకు గ్రాసర్లను (200 జతీశీతీప +తీశీంంపతీం) అందించిన ఏకైక తమిళ హీరోగా సూర్య అరుదైన చరిత్ర సృష్టించారు. ఎలాంటి అడ్డంకులనైనా ఎదుర్కొంటూ తన స్టార్ పవర్ ఏమాత్రం తగ్గలేదని ఆయన ఈ పరుస బ్లాక్‌బస్టర్లతో నిరూపించారు. ప్రేక్షకులను అలరించే వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ సూర్య బాక్సాఫీస్ రేసులో దూసుకెళ్తుండటంతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనపై అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.